thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 56 | జగిత్యాల | మంగళవారం | 19 మే, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ప్లే ఆఫ్స్ కు సన్ రైజర్స్



11

## త్వరలో హైదరాబాద్ మెట్రో రద్దీకి చెక్..

- ఇక ప్రయాణం సుఖమయం... హైదరాబాద్ మెట్రోకు 60 కొత్త కోచ్‌లు
- ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ కీలక నిర్ణయం
- బెంగళూరు బీఈఎంఎల్‌తో ఒప్పందానికి రంగం సిద్ధం
- పెరగనున్న రైళ్ల ఫ్రీక్వెన్సీతో ప్రయాణికులకు ఊరట

**హైదరాబాద్, మే 18 :** హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణికులకు త్వరలోనే పెద్ద ఊరట లభించనుంది. నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతున్న మెట్రో రైళ్లలో ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసింది. బెంగళూరుకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) నుంచి ఈ కోచ్‌లను కొనుగోలు చేయనున్నారు. ఈ వారంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, బీఈఎంఎల్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూడు కారిడార్లలో మొత్తం 56 రైళ్లు

మిగతా 3వ పేజీలో..





## సరస్వతి అంత్య పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం

- లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన కొండా సురేఖ
- మే 21 నుంచి జూన్ 1 వరకు పుష్కరాలు
- ఎండోమెంట్స్ అధికారులతో కలిసి మర్యాదపూర్వక భేటీ

2



2

## సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

- భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభించిన పొంగులేటి

# తెలంగాణ ఆలయాల్లో భక్తి వెల్లువ

**కోట్లలో కానుకలు.. రికార్డుల మోత**

- యాదగిరిగుట్టకు అత్యధికంగా రూ.93 కోట్లకు పైగా ఆదాయం
- ఉచిత బస్సు ప్రయాణంతో పెరిగిన మహిళా భక్తుల రద్దీ
- ఆన్‌లైన్ సేవలు, మెరుగైన సౌకర్యాలతో దేవాలయాలకు కొత్త ఊపు
- హుండీలు, ప్రసాదాలు, అర్జిత సేవలతో కళకళలాడుతున్న ఖజానాలు
- ఆధ్యాత్మిక కేంద్రాల నుంచి భారీ ఆర్థిక వనరులుగా మారుతున్న ఆలయాలు

**తెలంగాణ బ్యూరో, మే.18:** తెలంగాణలోని ప్రముఖ దేవాలయాలు ఇప్పుడు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా భారీ ఆర్థిక శక్తులుగా కూడా రూపాంతరం చెందుతున్నాయి. భక్తుల రద్దీ పెరగడం, సౌకర్యాల విస్తరణ, డిజిటల్ సేవల అందుబాటు, ప్రభుత్వ ప్రోత్సాహక చర్యలు కలిసి రాష్ట్ర ఆలయాల ఆదాయాన్ని కొత్త రికార్డుల దిశగా తీసుకెళ్లాయి. దేవాదాయ శాఖ విడుదల చేసిన 2025-26 ఆర్థిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 689 ఆలయాల నుంచి రూ.556 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. గత

మిగతా 2లో...





2

## 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగ

- పార్టీ చీఫ్ కవిత
- పార్టీ జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

## కేరళ సీఎంకు కోమటిరెడ్డి శుభాకాంక్షలు

- నూతన మంత్రివర్గానికీ అభినందనలు
- ప్రజల విశ్వాసానికి నిదర్శనమని వ్యాఖ్య
- సమగ్ర పాలన అందించాలని ఆకాంక్ష

**హైదరాబాద్, మే 18:** కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వీడీ సతీశన్‌కు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు

మిగతా 2వ పేజీలో..






## జహీరాబాద్‌లో పర్యాటక వారోత్సవాల ప్రారంభం

- ఎస్ఐహెచ్‌ఎంకు ఐదు కోట్ల మంజూరు ప్రకటన
- కొత్త కోర్సులు, ప్రవేశాలకు మంత్రి శ్రీకారం
- యువత ఉపాధిపై ప్రత్యేక దృష్టి

2



2

## అప్పుల పేరుతో పిలిచి హత్యలు!

- మొయినాబాద్ జంట మర్డర్ కేసులో షాకింగ్ ట్విస్ట్
- అప్పు ఇచ్చిన 8 మందిని టార్గెట్ చేసిన కలీమాబేగం దంపతులు

## కేబీఆర్ ఫ్లైఓవర్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలు

- చెట్ల తొలగింపుపై తాత్కాలిక నిలుపుదల
- పర్యావరణ పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు
- జూలై ఇరవై ఏడుకు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ, మే 18** హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు సమీపంలో ప్రతిపాదిత ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. తదుపరి విచారణ జరిగే వరకు చెట్లను నరికివేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణపరంగా సున్నిత ప్రాంతాల్లో నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోర్టు సూచించింది. విచారణ

మిగతా 3వ పేజీలో..



## తెలంగాణకు చల్లటి కబురు

- నేడు, రేపు పలు జిల్లాల్లో వర్షాలు
- ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాతావరణ మార్పులు
- ఎల్లుండి నుంచి మళ్లీ పెరగనున్న ఎండల తీవ్రత

3

# జహీరాబాద్‌లో పర్యాటక వారోత్సవాల ప్రారంభం

**జహీరాబాద్, మే 18**

'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ సంస్థలో పర్యాటక వారోత్సవాలను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో కొత్తగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను ప్రారంభించడంతో పాటు కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల ప్రవేశాలను కూడా లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్' పోస్టర్‌ను కూడా మంత్రి ఆవిష్కరించారు. సుదీర్ఘకాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను తిరిగి ప్రారంభించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించబోతోందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఎస్ఐహెచ్ఎంను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంత యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి స్వయం ఉపాధి దిశగా వారిని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. సంస్థలో చేరిన పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని దగ్గర చేసిందని, ప్రైవేట్ రంగంలో ప్రస్తుతం అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. యువత పర్యాటక, ఆతిథ్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

విద్యార్థులు కేవలం కోర్సులతోనే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని మంత్రి సూచించారు. విదేశీ భాషలు నేర్చుకోవడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు పెరుగుతాయని, పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, మే 18:**

పర్యావరణ, అటవీ శాఖలతో పాటు దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కొండా సురేఖ సోమవారం లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు హాజరుకావాలని ఆమె గవర్నర్‌ను ఆహ్వానించారు. మే 21 నుంచి జూన్ 1, 2026 వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా గవర్నర్‌కు అధికారిక ఆహ్వానం అందజేశారు. పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా వివరించారు. మంత్రి కొండా సురేఖతో పాటు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, శాఖ కమిషనర్ హనుమంతరావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పుష్కరాల ప్రాధాన్యం, నిర్వహణ ఏర్పాట్లపై వారు గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. సరస్వతి అంత్య పుష్కరాలు భక్తులకు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన వేడుకగా భావిస్తారని అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున భద్రత, రవాణా, తాగునీరు, వైద్య సేవలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. గవర్నర్‌తో జరిగిన ఈ భేటీ సానుకూల వాతావరణంలో సాగింది. పుష్కరాల విజయవంత నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు అభిప్రాయపడ్డారు.



# 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగ

**తెలంగాణ బ్యూరో , మే 18 :**

రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్ లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నామని పార్టీ చీఫ్ కవిత తెలిపారు. సోమవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దెల మోడల్ ను ఆవిష్కరించారు.మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు. పార్టీ జెండా గద్దె బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉంటుందని పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని తెలిపారు. జెండా గద్దె బేస్ కు గ్రీన్ కలర్.. పై భాగంలో ఉండే జెండా గద్దె కు ఎల్లో కలర్, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్ లో ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని సూచించారు. జెండా గద్దె బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని సూచించారు. ,పార్టీ జెండా కలర్ కోడ్స్ కూడా తాము ఇచ్చిన విధంగానే చూసుకోవాలని.. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉంటాయని వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు

# కేరళ సీఎంకు కోమటిరెడ్డి శుభాకాంక్షలు

**మొదటిపేజీ తరువాయి**



తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రివర్గ సభ్యులందరికీ అభినందనలు తెలియజేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా సందేశం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేరళ ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రజాస్వామ్య విలువలపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా కొత్త ప్రభుత్వం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు లభించిన ఈ విజయానికి ప్రజల విశ్వాసమే ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే దిశగా ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్య, సమగ్ర భావజాలంతో ముందుకు వెళ్లాలన్న సంకల్పానికి ఈ విజయం ప్రతిబింబమని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజల అంచనాలను అందుకునేలా పాలన అందించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో నూతన ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పాలన సాగించాలని సూచించారు. కేరళ కొత్త ప్రభుత్వం విజయవంతమైన పాలన అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# తెలంగాణ ఆలయాల్లో భక్తి వెల్లువ

**మొదటిపేజీ తరువాయి**

కొన్నేళ్లతో పోలిస్తే ఇది గణనీయమైన వృద్ధిగా అధికారులు చెబుతున్నారు.

తెలంగాణలో ఆధ్యాత్మిక పర్యాటకం వేగంగా విస్తరిస్తుండటం ఆలయాల ఆదాయ పెరుగుదలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం ప్రభావం ఆలయాల వద్ద స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు దేవాలయాలకు చేరుకుంటున్నారు. ప్రయాణ ఖర్చు ఆదా కావడంతో హుండీల్లో కానుకలు వేయడం, ప్రత్యేక పూజలు చేయించడం, ప్రసాదాలు కొనుగోలు చేయడం పెరిగినట్లు దేవాదాయ శాఖ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఇటీవల ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడం కూడా ఆదాయ వృద్ధికి కీలక కారణంగా మారింది. ప్రధాన దేవాలయాల్లో క్యూ లైన్లు, విశ్రాంతి గదులు, పార్కింగ్ సదుపాయాలు, అన్నదాన భవనాలు విస్తరించడంతో భక్తులకు ఇబ్బందులు తగ్గాయి. అర్జిత సేవలు, అభిషేకాలు, కల్యాణోత్సవాల టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం రావడంతో నగరాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య కూడా పెరిగింది.

రాష్ట్రంలో అత్యధిక ఆదాయం సాధించిన దేవాలయంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నిలిచింది. రూ.93.87 కోట్ల ఆదాయంతో ఈ ఆలయం అగ్రస్థానంలో నిలవడం విశేషం. పునర్నిర్మాణం తర్వాత యాదగిరిగుట్ట దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆధ్యాత్మిక క్షేత్రంగా మారింది. భక్తుల సంఖ్య పెరగడమే కాకుండా, పర్యాటక కేంద్రంగానూ అభివృద్ధి చెందడం అక్కడి ఆదాయాన్ని భారీగా పెంచింది.

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం రూ.73.43 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. శైవక్షేత్రంగా విశేష ఆదరణ పొందుతున్న ఈ ఆలయంలో నిత్య రద్దీ కొనసాగుతోంది. భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయానికి రూ.31.34 కోట్లు, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.21.98 కోట్లు, కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి రూ.20.97 కోట్ల ఆదాయం నమోదైంది.

బాసర జ్ఞాన సరస్వతీదేవి ఆలయం రూ.17.82 కోట్లు, బల్కంపేట ఎల్లమ్మ ఆలయం రూ.12.54 కోట్లు, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం రూ.12.20 కోట్ల ఆదాయాన్ని నమోదు చేశాయి. చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయం, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయాలు కూడా కోట్ల రూపాయల ఆదాయంతో ముందంజలో నిలిచాయి. వరంగల్ భద్రకాళి, ఏడుపాయల దుర్గమ్మ ఆలయాలు సైతం భారీ ఆదాయాన్ని సాధించాయి.

దేవాదాయ శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 346 ఆలయాలు గణనీయమైన ఆదాయం నమోదు చేశాయి. ఒకప్పుడు కేవలం స్థానిక భక్తులకే పరిమితమైన అనేక ఆలయాలు ఇప్పుడు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఎదుగుతున్నాయి. భక్తి, పర్యాటకం, డిజిటల్ సేవలు, ప్రభుత్వ ప్రోత్సాహం కలిసి తెలంగాణ ఆలయ ఆర్థిక వ్యవస్థను కొత్త దశలోకి తీసుకెళ్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అప్పుల పేరుతో పిలిచి హత్యలు!

- మొయినాబాద్ జంట మర్డర్ కేసులో షాకింగ్ ట్విస్ట్
- అప్పు ఇచ్చిన 8 మందిని టార్గెట్ చేసిన కరీమాబేగం దంపతులు
- ఇద్దరు మహిళలను చంపి ఫామ్‌హౌస్‌లోనే పాతిపెట్టిన నిందితులు
- మరో ఆరుగురిని కూడా రప్పించే ప్రయత్నం
- ప్రాణహాని ఉందంటూ పోలీసులను ఆశ్రయించిన మహిళలు
- విచారణలో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసిన కరీమాబేగం



**హైదరాబాద్, మే18:**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అప్పు ఇచ్చిన వారినే టార్గెట్ చేస్తూ కరీమాబేగం, ఆమె భర్త రెహమాన్ హత్యలకు ప్లాన్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడింది. మొత్తం 8 మందిని చంపాలని కుట్ర పన్నిన నిందితులు.. అందులో ఇద్దరు మహిళలను ఇప్పటికే హత్య చేసినట్లు విచారణలో తేలింది.

తాండూరు ఇందిరమ్మ కాలనీలో నివసించే ఆబేదా బేగం, మహబూబాబీతో పాటు మరి కొందరు మహిళలు కరీమాబేగం దంపతులకు, వారి బంధువు నయీంకు అప్పుగా నగదు ఇచ్చారు. చాలా కాలంగా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు ఒత్తిడి తీసుకువస్తుండటంతో వారిని అంతమొందించాలని నిందితులు పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు.

ముందుగా అప్పు తిరిగి ఇస్తామని నమ్మించి మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫామ్‌హౌస్‌కు పిలిపించారు. అక్కడ గొంతు నులిమి హత్య చేసి శవాన్ని పూడ్చిపెట్టారు. అనంతరం ఆబేదా బేగంను కూడా అదే ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఇద్దరు మహిళల హత్యల తర్వాత మరో ఆరుగురిని కూడా ఫామ్‌హౌస్‌కు రప్పించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయితే వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. జంట హత్యల ఘటన వెలుగులోకి రావడంతో మిగిలిన మహిళలు అప్రమత్తమై తమకు కూడా ప్రమాదం ఉందంటూ పోలీసులను ఆశ్రయించారు.

ఈ కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగంను అదుపులోకి తీసుకుని కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్న సమయంలో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తాగడంతో పోలీసులు వెంటనే హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు.

# గోవుల అక్రమ తరలింపును అడ్డుకోండి

- డీజీపీ కి రాజాసింగ్ లేఖ

**తెలంగాణ బ్యూరో, మే 18**

రాష్ట్రంలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 16న రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు.. రాజకీయ ఒత్తిడికి లోను కాకుండా పని చేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం.. అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ లేఖలో స్పష్టం చేశారు.

# సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

- ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం
- భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మే 18 :**

ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి సోమవారం ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా రాష్ట్రంలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్ని ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేస్తూ అందుబాటులో ఉన్న అత్యాధునిక పరికరాలను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఘటనాస్థలికి సకాలంలో చేరుకుని బాధిత ప్రజలకు వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేసేందుకు ఇలాంటి మాక్ డ్రిల్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహా వరదలను, ఇటీవలి గోదావరి, కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**కనువిందు చేసిన రెస్క్యూ ఆపరేషన్లు**

మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆరఎఫ్, ఎస్‌డీఆరఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను అభినందించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలు కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారమే చేరాలని, పుకార్లను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితోపాటు పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశు సంవర్ధక తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

చురకలు

మంగళవారం 19 మే 2026



# త్వరలో హైదరాబాద్ మెట్రో రద్దీకి చెక్..

**మొదటిపేజీ తరువాయి**

సేవలందిస్తున్నాయి. ఒక్కో రైలుకు మూడు కోచ్‌లు మాత్రమే ఉండటంతో ప్రతిరోజూ ప్రయాణించే దాదాపు 5 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎల్బీనగర్ మియాపూర్, నాగోల్ రాయదుర్గం మార్గాల్లో రైళ్లలో నిలబడటానికి కూడా చోటు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే అదనపు కోచ్‌ల కొనుగోలు అనివార్యంగా మారింది. ఆర్డర్ ఇచ్చిన నాటి నుంచి కేవలం 15 నెలల వ్యవధిలోనే కొత్త కోచ్‌లను సరఫరా చేస్తామని బీఈఎంఎల్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. గతంలో రద్దీని అధిగమించేందుకు నాగ్‌పూర్ మెట్రో నుంచి కొన్ని కోచ్‌లను లీజుకు తీసుకోవాలని ప్రయత్నించినా, సాంకేతిక కారణాలతో అది ముందుకు సాగలేదు. అయితే, ఇటీవల హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో కోచ్‌ల కొనుగోలుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో బీఈఎంఎల్‌కు ఆర్డర్ ఇచ్చే ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 2015లో సుమారు రూ.1800 కోట్లతో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ రొటెమ్ సంస్థ నుంచి మెట్రో కోచ్‌లను కొనుగోలు చేశారు. ఇప్పుడు కొత్త కోచ్‌ల తయారీ కోసం హ్యుందాయ్ తమ సాంకేతికతను బీఈఎంఎల్‌కు బదిలీ చేసేందుకు అంగీకరించింది. దేశంలోని అనేక మెట్రో ప్రాజెక్టులకు విజయవంతంగా కోచ్‌లను సరఫరా చేసిన అనుభవం బీఈఎంఎల్‌కు ఉంది. ఈ 60 కొత్త కోచ్‌లు అందుబాటులోకి వస్తే, రద్దీ మార్గాల్లో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడంతో పాటు ప్రయాణికులకు సీటింగ్ సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఫలితంగా మెట్రో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా, సుఖవంతంగా మారనుంది.

## కేబీఆర్ ఫ్లైఓవర్‌పై
# సుప్రీంకోర్టు ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి**

సందర్భంగా పార్కు పరిధిలోని ఇరవై ఐదు నుంచి ముప్పై మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను తొలగించవద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు వెయ్యి మూడు వందల చెట్లను నరికివేయబోతున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. చెట్ల తొలగింపుకు బదులుగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు పరిశీలించారా అని న్యాయస్థానం ప్రశ్నించింది. చెట్లు నరకకుండా నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉందా అనే అంశంపై కూడా వివరణ కోరింది. అయితే అలాంటి ప్రణాళిక ప్రస్తుతం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం రాత్రి, పగలు అనే తేడా లేకుండా చెట్ల తొలగింపు చేపడుతోందని పిటిషనర్లు ఆరోపించారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. వాదనలు విన్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ శాఖను ప్రతివాదులుగా చేర్చి నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను జూలై ఇరవై ఏడుకు వాయిదా వేసింది. అప్పటి వరకు చెట్ల తొలగింపుపై ఆంక్షలు కొనసాగనున్నాయి. ఈ పరిణామం పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



## ఆరు గిరిజన మ్యూజియంలు
# రాష్ట్రానికి గర్వకారణం

- **గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కమ్ డైరెక్టర్ సంతోష్**

**హైదరాబాద్, మే 18 :**

ఇతర రాష్ట్రాలలో సాధారణంగా ఒక్క గిరిజన మ్యూజియం మాత్రమే ఉండగా తెలంగాణలో ఆరు గిరిజన మ్యూజియంలు ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కమ్ డైరెక్టర్ సంతోష్ బి.ఎమ్ అన్నారు. వేగంగా మారుతున్న ఆధునిక సమాజంలో గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు, జీవన విధానం, విలువలు తదితర వారసత్వ సంపదను భావితరాలకు పరిచయం చేసే ప్రధాన వేదికలుగా మ్యూజియంలు నిలుస్తాయన్నారు. హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ శత జయంతి ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీమ్, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుమ్రం భీమ్, రాంజీ గోండ్ వంటి గిరిజన వీరులు ప్రజల హక్కులు, స్వేచ్ఛ, స్వాభిమానాల కోసం చేసిన పోరాటాలు, త్యాగాలు తదితర చారిత్రక అంశాలను యువతకు తెలియజేయడంలో గిరిజన మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు, యువత ఆసక్తిగా నేర్చుకునే విధంగా గిరిజన మ్యూజియంలను ఇంటరాక్టివ్, డిజిటల్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నవంబర్ 15 నాటికి రాంజీ గోండ్ స్మారక గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంను అత్యాధునిక హంగులతో పూర్తి చేసి ప్రధానమంత్రిని ఆహ్వానించి ఆవిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు సర్వేశ్వర్ రెడ్డి, టి.ఆర్.ఐ డైరెక్టర్ సముజ్వల, మ్యూజియం క్యూరేటర్ సత్యనారాయణ, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో చురుగ్గా ఉండాలి

**హైదరాబాద్, మే 18 :**

పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తల పాత్రపై బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ మూడు అంశాలపై నాయకులు, కార్యకర్తలు చురుకుగా పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకోబోతున్న సమయంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇంధన పొదుపుపై మేరా భారత్ - మేరా యోగదాన్ (దేశానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించడం) అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత నెలకొనగా అనేక దేశాలు ఇంధన ధరలను భారీగా పెంచాయని, కొన్ని దేశాల్లో రేషన్ విధానం కూడా అమలు చేస్తున్నారని తెలిపారు. మన కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అదనపు భారం పడకుండా చూసిందన్నారు. అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇంధన వినియోగంలో క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందని, ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంధన పొదుపు చేయాలని, కార్‌పూలింగ్, ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా ఉపయోగించాలని, విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలని, అవసరమైతే వర్క్ ఫ్రమ్ హోమ్ ను కూడా అనుసరించాలని సూచించారు. తాను కూడా ఈరోజు విద్యుత్ కారులో వచ్చానని, ఇది ప్రచారం కోసం కాదు..



దేశ ప్రయోజనం కోసం.. మన జీవన విధానంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందనే సందేశం ఇవ్వడంతోపాటు ప్రధాని మోదీ సందేశాన్ని ఆచరణలో పెట్టడానికేనని స్పష్టం చేశారు. కార్యకర్తలు కూడా ఈ దిశగా ఆలోచించాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అంటూ 'ఒక చెట్టు - అమ్మ పేరు మీద' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రకృతి పరిరక్షణ కోసం స్థానిక ఉత్పత్తులను వినియోగించాలని, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని, పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ముందుకు సాగాలని కోరారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలన్నారు.

**బీఆర్ఎస్‌పై విమర్శల దాడి**

బీఆర్ఎస్ వంటి పార్టీల వైఖరి వల్ల రాజకీయ పరిస్థితులు దారుణంగా తయారయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా ఆ పార్టీ నాయకులు బీజేపీని లక్ష్యంగా చేసుకుని ఒక వ్యక్తిని, ఆ కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పెద్ద ఎత్తున ఖర్చుతో పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారం, అనుకూల మీడియా ద్వారా బద్నాం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని, ఒకవేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తప్పు చేసి ఉంటే పార్టీ కూడా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కానీ ఇక్కడ జరిగింది ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించింది. వారు తప్పు చేసి ఉంటే చట్టం తన పని చేస్తుంది.. కోర్టులు నిర్ణయం తీసుకుంటాయి అని అన్నారు. చట్టపరమైన హక్కుల ప్రకారం ముందస్తు బెయిల్ తీసుకోవడం పారిపోవడం కాదన్నారు. ముందు బీఆర్ఎస్ నాయకులు తమ పాలనలో జరిగిన ఘటనలకు సమాధానం చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలు, అవినీతి అంశంపై విచారణలు ప్రారంభమయ్యాక కోర్టులను ఆశ్రయించిన వారు ఇప్పుడు నైతికత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం 2014లో మహిళలపై నమోదైన కేసులు 14,147 ఉండగా 2023 నాటికి అవి 23,679కి చేరాయని, అంటే మహిళలపై నేరాలు సుమారు 67 శాతం పెరిగాయని, దీనికి బీఆరఎస్ నాయకత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. 2022లో జూబ్లీహిల్స్ మైనర్ బాలికపై అత్యాచారం, 2019లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సమత (30) పై సామూహిక అత్యాచారం జరిగింది.. ఈ ఘటనలపై మీ నైతిక బాధ్యత ఎక్కడికి పోయింది అని ప్రశ్నిస్తున్నానన్నారు. వేధింపులను తట్టుకోలేక 2023లో వరంగల్‌లో డాక్టర్ ప్రీతి ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికి మీ ప్రభుత్వం బాధ్యత వహించదా? ముఖ్యమంత్రి బాధ్యత వహించరా? అదేవిధంగా మీ పార్టీకి చెందిన ఓ మహిళా సర్పంచ్ తనపై ఎమ్మెల్యే లైంగిక వేధింపులు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.. సూర్యాపేట జిల్లాకు చెందిన లంబాడ యువతి లక్ష్మి పోలీసుల వేధింపుల వల్లే ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కస్టడీలో మృతిచెందిందనే ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు కేటీఆర్.. మీ పాలనలో టీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు, నాయకులు కూడా పలు అత్యాచార, మహిళా వేధింపుల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆ నాయకులతో సంబంధాలున్న వ్యక్తులు యువతులకు డ్రగ్స్ ఇచ్చి కిడ్నాప్ చేసిన కేసుల్లో కూడా ఆరోపణలు ఎదుర్కొన్నారని రామచందర్‌రావు తెలిపారు. నిర్మల్‌లో మైనర్ పై అత్యాచారం కేసులో కూడా టీఆర్ఎస్ నాయకుల పేర్లు వినిపించాయి. మహిళల హక్కులు, మైనర్ల భద్రత గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు ఎక్కడుంది.. ఆ సమయంలో కేసీఆర్ రాజీనామా చేశారా.. కేటీఆర్ బాధ్యత తీసుకున్నారా.. ఎవరైనా నైతిక బాధ్యత వహించారా అని ప్రశ్నించారు. ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీపై విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారు. కేటీఆర్ కుటుంబీకులపై లిక్కర్ స్కామ్ ఆరోపణల సమయంలో కూడా బీఆర్ఎస్ నాయకత్వం రాజీనామాలు చేయలేదు. కాళేశ్వరం, ఫార్ములా ఈరేస్ వంటి అంశాల్లో ఇరుక్కుపోతామనే భయంతో కేటీఆర్‌తోపాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు బీజేపీపై విష ప్రచారం చేస్తున్నారని రామచందర్‌రావు విమర్శించారు. సమావేశంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింపుల్ ఈగవర్నెన్స్‌తో మెరుగైన సేవలు

- **సీఎస్‌లకు కేంద్ర కేబినెట్ సెక్రటరీ సోమనాథన్ ఆదేశం**

**హైదరాబాద్, మే 18 :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈగవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రటరీ డాక్టర్ టి.వి.సోమనాథన్ ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న సింపుల్ ఈగవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పాటించి ఆయా రాష్ట్రాలలో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన, మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సూచించారు. ఈ



సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈగవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు విభాగాల వారీగా ఆన్ లైన్‌లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామని చెప్పారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈగవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల గురించి తెలిపారు. ఈగవర్నెన్స్ విధానంపై సీఎస్ రామకృష్ణారావును కేబినెట్ సెక్రటరీ అభినందించారు. తమిళనాడు ప్రభుత్వ విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థిక భారం, ఇతర ఇబ్బందులు కలగకుండా ఈగవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, శికా గోయల్, సెక్రటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎండీ వి.పి.గౌతం, సెర్ప్ సీఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

## భూమి కోసం అక్కను హత్య చేసిన తమ్ముడు

**సూర్యపేట, మే 18 :**

ఆస్తి కోసం సొంత అక్కను తమ్ముడు హత్య చేసిన ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం తుమ్మల పెన్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. సురుగి అంజమ్మ భర్త మరణించడంతోపాటు పిల్లలు లేకపోవడంతో తన స్వగ్రామమైన తుమ్మల పెన్‌పహాడ్ లో చెల్లెలు వద్ద నివాసం ఉంటోంది. ఈ క్రమంలో తనను చూసుకుంటున్న చెల్లెలికి తన పేరుపై ఉన్న రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని అంజమ్మ నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో అక్క, తమ్ముడు మధ్య కొంతకాలంగా తీవ్ర వివాదం కొనసాగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తనకు కాకుండా చెల్లెలికి భూమి ఇస్తానని అంజమ్మ చెప్పడంతో తమ్ముడు తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం సుమారు 6:45 గంటల సమయంలో అంజమ్మ కరువు పనులకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన తమ్ముడు పదునైన కత్తితో పలుమార్లు దాడి చేసినట్లు సమాచారం. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడిపోయిన ఆమెను స్థానికులు వెంటనే హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిసింది. ఘటనతో తుమ్మల పెన్‌పహాడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# నిజామాబాద్‌కు పంగనామాలు

- **ఇచ్చిన హామీలను పట్టించుకోని రేవంత్**
- **తలెత్తుకోలేకపోతున్న పీసీసీ చీఫ్**
- **ఎంపీ అరవింద్ విమర్శలు**

**నిజామాబాద్, మే 18:**


నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ హామీలు ఏమయ్యాయన్నారు. ఈ హామీలు నెరవేర్చకపోవడంతో పీసీసీ చీఫ్ తలెత్తుకోలేకపోతున్నారన్నారు. నిజామాబాద్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో ఆయన తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే బుద్ధి చెబుతారన్నారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని ఎంపీ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తికావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటివరకు 25 శాతం పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు గాను రూ.10 కోట్ల నిధులు మాత్రమే ప్రభుత్వం కేటాయించిందన్నారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని వ్యాఖ్యానించారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని సీఎం ఒప్పుకున్నారన్నారు. రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి వంటి జెన్యూన్ పర్సన్‌ను ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ అగ్రనేతలకు ఎంపీ అరవింద్ సూచించారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్‌గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌నే ప్రజలు నమ్మలేదని, ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి చురకలు అంటించారు.



# తెలంగాణకు చల్లటి కబురు

**హైదరాబాద్, మే 18 :**

భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరవుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఊరటనిచ్చే సమాచారం వెల్లడించింది. రాష్ట్రంలో ఉపరితల చక్రవాత ఆవర్తన ప్రభావంతో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.
వాతావరణ శాఖ అంచనాల ప్రకారం హైదరాబాద్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, కామారెడ్డి, మల్కాజిగిరి, రంగారెడ్డి, వనపర్తి, గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.





గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు రావడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో వర్షాలు కురవడం వల్ల ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. అయితే ఈ ఉపశమనం తాత్కాలికమేనని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎల్లుండి నుంచి రాష్ట్రంలో మళ్లీ ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. పలు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండటంతో రెడ్ అలర్ట్ కూడా జారీ చేశారు. ఎండల ప్రభావం అధికంగా ఉండే అవకాశాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకూడదని, బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.
వేసవి తీవ్రత దృష్ట్యా ఎక్కువగా నీరు తాగడం, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం, చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని సూచించారు. రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.



# సంక్షోభాల సృష్టికర్తలు మన పాలకులు!

## కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు..

## అప్పుల ఊబి నుంచి రాష్ట్రాలను రక్షించడం ముఖ్యం!

## అప్పులతో సంక్షేమం.. ఆర్భాటాలతో పాలన..

## దేశ ఆర్థిక వ్యవస్థకు పెరుగుతున్న ముప్పు

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళుతుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకోనంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పులుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

# కేరళం సీఎంగా సతీశన్ ప్రమాణం

**ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్**

**హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి**



**తిరువనంతపురం, మే 18:** కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్



నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్విందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

# మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

- ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం
- ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు
- నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన

**న్యూఢిల్లీ, మే 18:** భారత్–నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్–యూరప్ భాగస్వామ్యం మరింత



కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్–ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్–నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో–నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్–నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

- కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానం
- వారి కృషి అసామాన్యమని అమిత్‌షా కితాబు



**రాయ్‌పూర్, మే 18:** దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గడ్ లోని జగదల్పూర్‌లో సోమవారం తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశిరచుకున్నట్లు వెల్లడించారు.మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. క్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు.క జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ట్రక్కును ఢీకొన్న కంటెయినర్ పదిమంది మృతి

**మహారాష్ట్రలో ఘోర ప్రమాదం**

**ముంబై, మే 18:** మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిఒ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొనడంతో పదిమంది దుర్మరణం చెందారు. ముంబై – అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 10 మందికిపైగా మృతిచెందగా, మరో 25 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. ఘటనాస్థలిలోనే పదిమందికి పైగా మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.



అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

చురకలు

మంగళవారం 19 మే 2026

# కోవ లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ



**ఆసిఫాబాద్ టౌన్ :** వేసవి తాపాన్ని తీర్చడానికి ఆసిఫాబాద్ పట్టణంలోని వివేకానంద చౌక్ సమీపంలో కోవ లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చల్లని త్రాగునీరు, అంబలి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, కౌన్సిలర్లు స్థానిక ప్రజలకు, బాటసారులకు స్వయంగా అంబలిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్స పోచన్న, కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న, కుర్సెంగ బాలకృష్ణ, బీ ఆర్ ఎస్ టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్ బిన్ అబ్దుల్లా , నాయకులు నిస్సార్, నాగరాజు, ఉమ, లలిత తదితరులు పాల్గొన్నారు.


# కేజీ మల్లెల సొసైటీ అధ్యక్షుడిగా కంటే చెన్నారావు



**సత్తుపల్లి:** వేంసూర్ మండల పరిధిలోని కేజీ మల్లెల సొసైటీ అధ్యక్షుడిగా కంటే చెన్నారావు నియమితులైన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు కంటే వెంకటేశ్వరరావు నివాసంలో సమావేశమై కంటే చెన్నారావును శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వేంసూర్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కంటే వెంకటేశ్వర రావుతో పాటు మండల పార్టీ నాయకులు దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, పుచ్చకాయల శంకర్ రెడ్డి, నల్లమోతు ప్రసాద్, పోటు ప్రసాద్, కాటే జమలారావు, గాదె శ్రీనివాసరావు, మారోజు సురేష్, వల్లభనేని సత్యనారాయణ, మందపాటి శేఖర్ రెడ్డి, దొడ్డ శోభనాచలం, మిరియాల ప్రసాద్, కంటే అప్పారావు, కంటే నాగేశ్వరరావు, డీలర్ వెంకటేశ్వరరావు, కంటే పెద్దన్న, కొనకాల లక్ష్మీనారాయణ, తాత కృష్ణయ్య, పెద్ద గౌడ్ అప్పారావు, మామిడి శ్రీనివాసరావు, రాజబోయిన నరసింహారావు, గూడూరు గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**హన్మకొండ:** పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బాల సముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని 48 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.14లక్షల 45వేల 500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర వైద్య సహాయం అందిస్తూ ప్రభుత్వం మానవతా దృక్పథంతో పనిచేస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హుల దరిచేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, మహిళా సంక్షేమ పథకాల ద్వారా సామాన్య ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# సిర్పూర్ దర్గాను టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలి





- **కాంగ్రెస్ మైనార్టీ జిల్లా చైర్మన్ యూనిస్ హుస్సేన్**

**కాగజ్ నగర్:** హైదరాబాద్‌లో ని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి జిల్లా మైనార్టీ ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీ ఉల్లా, ఖానాపూర్ శాసనసభ్యులు వేడమ బొజ్జు, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఫహీం ఖురేషిలతో కలిసి ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మైనార్టీ ప్రతినిధులు లేవనెత్తిన వివిధ ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నదీమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

**సిర్పూర్ దర్గా అభివృద్ధి, మైనార్టీ సమస్యలపై వినతి**

సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ జిల్లా చైర్మన్ యూనిస్ హుస్సేన్ మాట్లాడుతూ.. చారిత్రాత్మక నేపథ్యం కలిగిన సిర్పూర్ దర్గాను టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే సిర్పూర్, కాగజ్‌నగర్ ప్రాంతాల్లో నూతన మైనార్టీ ఫంక్షన్ హాళ్ల ఏర్పాటు, ఖబ్రస్తాన్‌ల అభివృద్ధి, నూతన ఈద్గా నిర్మాణం చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డ్వాక్రా గ్రూపుల్లోని మైనార్టీ మహిళలకు వడ్డీ లేని ప్రత్యేక రుణాలు అందించాలని, కాగజ్‌నగర్‌లోని ఆశుర్ ఖానా సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు యూనిస్ హుస్సేన్ తెలిపారు.

**జిల్లాలోని మైనారిటీల సమస్యలు పరిష్కరించాలి**

కాంగ్రెస్ మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షకీల్కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షకీల్ మైనార్టీలకు సంబం ధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మైనార్టీల సమ స్యలను త్వరిత గతిన పరిష్కరించడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కష్టపడి పనిచేస్తున్న కాంగ్రెస్ మైనార్టీ నాయకులకు ప్రభుత్వంలో, పార్టీలో సముచిత స్థానం కల్పించి గుర్తించాలని ఆయన ఈ సందర్భంగా మంత్రిని కోరారు.

# గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

## జిల్లా కలెక్టర్ కె. హరిత

**ఆసిఫాబాద్:** జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలనాధికారి చాంబర్ లో భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జన జాతీయ గ్రామ ఉత్సవ్ 2026 సంబంధిత గోడ ప్రతులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ లో భాగంగా గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో రహదారి, త్రాగునీరు, గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం, ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ సేవలు అదే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పక్కా ఇండ్లు లేని గిరిజనులకు గృహాలు మంజూరు చేస్తామని, గిరిజనుల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ ఎం డెవిడ్

**ఆసిఫాబాద్ టౌన్:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం డెవిడ్ అన్నారు . సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ,అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమములో వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు గత ప్రజావాణిలో అందిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దరఖాస్తు దారుల నుండి అర్జీలు స్వీకరించారు ఆసిఫాబాద్ మండలంలోని రాహపల్లి గ్రామానికి చెందిన పిడుగు మొండయ్య తనకు సెంట్రింగ్ మేస్త్రి పనుల పరికరాల కొనుగోళ్ళ కొరకు పి ఎం జి పి రుణము ఇప్పించుట గురించి. రెబ్బెన మండలంలో ని గోలేటి కి చెందిన గుగులోత్ స్వప్న గోలేటి శివారులో ఉన్న సాగు భూమికి నీటి సౌకర్యం కల్పించడం కొరకు మోటారు పంపు మంజూరి దరఖాస్తు. కౌటాల మండల కేంద్రానికి చెందిన ఎలుములె జ్ఞానేశ్వర్ మొగడ్ ధగడ్ క్రాస్ రోడ్డ్ వద్ద డ్రైనేజి నిర్మించుట గురించి దరఖాస్తు లింగాపూర్ మండలంలోని మొతిపటార్ గ్రామానికి చెందిన జాదవ్ లలిత ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేదుకు అటవీ శాఖ అనుమతులు ఇప్పించుట గురించి దరఖాస్తు .రెబ్బెన మండలం నవేగం గ్రామనికి చెందిన కమటి శంకర్ తనకు దివ్యంగా పించన్ ఇప్పించుట గురించి దరఖాస్తు, రెబ్బెన మండలం గోలెటి చెందిన కట్ల రజిత తనకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరి గురించి దరఖాస్తు . జిల్లా కేంద్రానికి చెందిన ఎం డి జమిల్ హుస్సేన్ తనకు ఫ్రీడం ఫైటర్ సర్టిఫికేట్ మంజూరి గురించి దరఖాస్తు జైనూర్ మండలం దబోలి గ్రామానికి చెందిన కొడప మిరభాయి తనకు రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు .



# ఆదివాసి కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్ కు బోరంచు స్వాగతం



**ఆదిలాబాద్:** ఆదివాసి లీడర్షిప్ డెవలప్మెంట్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా డీసీసీ కార్యాలయానికి విచ్చిన ఆదివాసి కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్ కుసుంతాయి ఆలంకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచ శ్రీకాంత్ రెడ్డి సోమవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధి, రాజకీయ చైతన్యం, నాయకత్వ వికాసం కోసం నిర్వహిస్తున్న లీడర్షిప్ డెవలప్మెంట్ మిషన్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఆదివాసి సమాజానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

## జిల్లా కమిటీ వినతి

**ఆసిఫాబాద్ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవడానికి నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర ఉద్యమకారుల కమిటీ సభ్యులను కుమురం భీం అసిఫాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల కమిటీ సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కుమురం భీం అసిఫాబాద్ జిల్లా కన్వీనర్ కొంద్ర రాజేశ్వర్, కో-కన్వీనర్ ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ నిర్ణయం పట్ల వారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నాటి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సాధనలో, తెలంగాణ కోసం చురుగ్గా పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారుడిని ప్రభుత్వం గుర్తించి, అన్ని విధాలా ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ లకి విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో ఉద్యమకారులు రాపర్తి అశోక్, ఎరుబోతుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రాష్ట్ర అబ్కారి శాఖ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు




**ఆసిఫాబాద్:** ఉమ్మడి జిల్లాలలోని మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు సోమవారం హైదరాబాద్ లోని మైనార్టీ సంక్షేమ కార్యలయంలోని ఉమ్మడి జిల్లా మైనార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర మైనార్టీ సంక్షేమ కార్యదర్శి షఫీ ఉల్లా ఖానాపూర్ శాసనసభ్యులు వేడమ బోజ్జు తో కలిసి ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో మంత్రి సమీక్షించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గం చూపాలన్నారు మైనార్టీ వసతి గృహాలలో , గురుకులాలలో మౌళిక సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయులు ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మైనార్టీలు నివసిస్తున్న ప్రాంతాల్లో త్రాగునీరు, పారిశుద్య పనులు ప్రతి రోజు చేపట్టాలన్నారు. షాది ఖానాల ఏర్పాట్లు మైనార్టీ ఫంక్షన్ హాల్, కబ్రాస్తాన్ లకు ప్రహరి గోడ నిర్మాణాలు రహదారులు ఏర్పాటు చేయాలన్నారు.



మైనార్టీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అహ్మద్ నదిమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమములో అధికారులు మైనార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం



**హన్మకొండ:** దామెర గ్రామానికి చెందిన దేవమ్మ కుటుంబానికి రైసింగ్ స్టార్ యూత్ సభ్యులు, దాతల సహకారంతో రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో యువత, దాతలు ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వేల్పుల రాజ్కుమార్ మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ప్రతిఒక్క దాతకు, రైసింగ్ స్టార్ యూత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో మానవత్వం ఇంకా సజీవంగా ఉందనడానికి ఈ కార్యక్రమమే నిదర్శనమని పేర్కొన్నారు. యువత సేవా కార్యక్రమాల్లో ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా రైసింగ్ స్టార్ యూత్ సభ్యులు ఇదే సేవా స్ఫూర్తితో అవసరంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు సభ్యులు దామెర అఖిల్ నితిన్, మంద కట్టయ్య, దౌడు సురేష్, దామెర లక్ష్మీనారాయణ, దామెర సతీష్, ఈసంపల్లి సందీప్, ఎడ్ల ప్రణయ్, దామెర నరేష్, ఎడ్ల ప్రేమ్కుమార్, మామిడి వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ మెడిసన్ విక్రయాల నోటిఫికేషన్ రద్దు చేయాలి

**తాండూర్:** కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆన్లైన్ మెడిసన్ విక్రయాల నోటిఫికేషన్ రద్దు చేయాలని మెడికల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ తాండూర్ మండలం అధ్యక్షులు జగన్మోహన్ చారి డిమాండ్ చేశారు. సోమవారం తాండూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఈనెల 20న మెడికల్ షాపుల బంద్ కు పిలుపునిచ్చామని, తాండూర్ మండలంలోని మెడికల్ షాపులు బంద్ లో పాల్గొంటాయని పేర్కొన్నారు. దేశ వ్యాప్త మెడికల్ షాపుల బంద్ లో హోల్సేల్, రిటైల్ షాపుల యాజమాన్యాలు పాల్గొంటున్నారని చెప్పారు. 2018 నుంచి ఇప్పటి వరకు అనేకసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించినా ఆన్ లైన్ మెడిసిన్ విక్రయాలు నిలిపివేయడం లేదన్నారు. కెమిస్ట్, డ్రగ్గిస్ట్ నిబంధనలకు వ్యతిరేఖంగా కొనసాగుతున్న విక్రయాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయోటిక్ మందుల విక్రయాలు ప్రజలకు ప్రమాదకరమని పేర్కొన్నారు. దేశ వాప్తంగా 40లక్షలు, రాష్ట్రంలో 14లక్షల హోల్సేల్, రిటైల్ షాపులు ఉన్నాయని, వీటిపై ఆధారపడి కోట్లాది యువత, ప్రజలు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అత్యవసర వైద్య సేవల మందులు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. సెల్: 9347551355, 9866004480 లపై సంప్రదించాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేసి తాండూర్ తహశీల్దార్, సర్కిల్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపాముల రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు భోగె శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు మామిడాల రాజేశం, బొంతల తిరుపతి, నేరెళ్ల కుమార్, గందె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.




# యువత ఆరోగ్యంపై దృష్టి సారించాలి

**అదనపు కలెక్టర్ రాజేశ్వర్**




**ఆదిలాబాద్:** యువత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి 5కే మారథాన్ రన్ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి రన్ను ప్రారంభించారు. ఈ మారథాన్ రన్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమై కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి స్టేడియం వరకు సాగింది. ఈ పరుగులో ప్రభుత్వ ఉద్యోగులు, యువతీ యువకులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం 5K రన్లో ప్రతిభ కనబర్చి గెలుపొందిన విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిత్యజీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి జక్కుల శ్రీనివాస్, డిఆర్డిఓ రాథోడ్ రవీందర్, డీపీఓ రమేష్, సంక్షేమ అధికారి మిల్కా, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, క్రీడా కోచ్లు, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, ఉద్యోగులు, యువత పాల్గొన్నారు.

# ఈ నెల 19న జిల్లాకు రాష్ట్ర ఎస్. సి., ఎస్. టి. కమిషన్ సభ్యులు రాక

**ఆసిఫాబాద్ టౌన్ :**

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ ఈ నెల 19వ తేదీన జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని చింతల వానపల్లి మండలం కర్జవెల్లి గ్రామపంచాయతీ పరిధిలో తమ కుటుంబాలను పోషించుకునేందుకు గత సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములలో సాగు అవుతున్న పంటలను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేసి భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని పోడు రైతులు చేసిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర కమిషన్ సభ్యులతో కలిసి విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. దాదాపు 50 షెడ్యూల్ కులాలకు చెందిన కుటుంబాలు కుటుంబానికి 2/3 ఎకరాల చొప్పున పంట సాగుపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, అటవీ శాఖ అధికారులు తమ పంటను ధ్వంసం చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు బాధితులు దరఖాస్తులో పేర్కొన్నారని, ఈ విషయమై క్షేత్రస్థాయిలో సందర్శించి విచారించడం జరుగుతుందని తెలిపారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- వరి ధాన్యం రవాణా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం
- ములుగు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో చర్చలు




**ములుగు:** జిల్లాలో యాసంగి పంటగా రైతులు పండించిన వరి ధాన్యం రవాణాలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ములుగు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు, రవాణా శాఖ అధికారులు, లారీ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం రవాణాకు లారీల కొరత ఉన్న నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లుల్లో త్వరితగతిన అన్లోడ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, పౌర సరఫరాల శాఖ అధికారులు సానుకూలంగా స్పందిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కరానికి సమన్వయంతో పనిచేయాలి

**కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**




**సత్తుపల్లి:** కల్లూరు డివిజన్ పరిధిలో ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, తాగునీటి సమస్యలు, ఉపాధిహామీ పనులు తదితర అంశాలపై ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖ అధికారులు బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువవుతున్నాయని, అధికారులు ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**భూమికి పట్టా ఇవ్వాలని..**

తాను కొనుగోలు చేసి సాగు చేస్తున్న భూమికి ఇప్పటివరకు పట్టా రాకపోవడంతో పాటు, ఆ భూమిపై మరొకరి పేరుతో రైతుబంధు లబ్ధి పొందుతున్నారని ఓ రైతు ప్రజావాణిలో అధికారులను ఆశ్రయించాడు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రైతు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు వినతిపత్రం అందజేశాడు. తాను చట్టబద్ధంగా భూమి కొనుగోలు చేసి సంవత్సరాలుగా సాగు చేస్తున్నప్పటికీ, రెవెన్యూ రికార్డుల్లో తన పేరు నమోదు కాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం భూమి పట్టా మరొకరి పేరుతో కొనసాగుతుండటంతో రైతుబంధు పథకం లబ్ధి కూడా వారే పొందుతున్నారని తెలిపాడు. తనకు న్యాయం చేసి భూమిని తన పేరుపై పట్టాదారు పాస్బుక్లో నమోదు చేసి, రైతుబంధు లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని కోరాడు. వినతి పత్రాన్ని స్వీకరించిన అధికారులు సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# 20న మెడికల్ షాపులు బంద్



**సత్తుపల్లి:** దేశ వ్యాప్తంగా ఈనెల 20న మెడికల్ షాపులు బంద్ కానున్న నేపథ్యంలో వేంసూరు మండలంలోని మెడికల్ షాపుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని ఔషధ వ్యాపారుల సంఘాలు బంద్కు పిలుపునిచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ–ఫార్మసీల నిర్వహణ, ఆన్లైన్లో యాంటీబయాటిక్స్ విచ్చలవిడిగా విక్రయించడం, కృత్రిమ మేధస్సు సహాయంతో నకిలీ ప్రిస్క్రిప్షన్లు తయారు చేయడం ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోందని సంఘాలు పేర్కొన్నాయి. ఈ పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా వేంసూరు మండల మెడికల్ షాపుల నిర్వాహకులు మాట్లాడుతూ ఆన్లైన్ ఔషధ విక్రయాలతో చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వాలు కఠిన నియంత్రణలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని సంఘాల నాయకులు హెచ్చరించారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్కు రైతుల సన్మానం



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిని రైతులు ఘనంగా సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయనకు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలో కొత్తగా కొనుగోలు కేంద్రాలతో పాటు, పంట నిల్వల కోసం తాత్కాలిక గోడౌన్ల ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొంత మంది కావాలనే కొనుగోళ్లపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు ఎలాంటి వదంతులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం మద్దతు ధరకే ప్రతి గింజనూ కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి, మార్కెట్ కమిటీ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రటరీలు సోయం తులసీదాస్, అగ్గు రమేష్, ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్, మావల సర్పంచ్ శేఖర్, శ్యామ్ జాదవ్, కినక బాపురావు, శ్రీనివాస్ గౌడ్, కుమ్ర లాల్ సావ్, కినక నరేష్, రైతులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితో అధిక దిగుబడి



**కౌటాల:** పంట మార్పిడి పద్ధతి పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త ఉపేందర్ సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్త కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గుడ్లబోరి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా వాడకం తగ్గించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యం కాపాడవచ్చని అన్నారు. అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులు వాడి ప్రకృతి ని కాపడాలని సూచించారు. అలాగే సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి మానవుల ఆరోగ్యం, నేల ఆరోగ్యం, పర్యావరణ ఆరోగ్యం కాపడాలని రైతులకు సూచించారు. సాగు నీటిని పొదుపుగా వాడి పంటలను పండించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్ది మంగ, ఉప సర్పంచ్ దందర మధు, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుమిత్ర, మండల వ్యవసాయ అధికారి పి.ప్రేమలత, వ్యవసాయ విస్తరణ అధికారి సీహెచ్. అంజన్న, గ్రామ కార్యదర్శి పి.భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి


**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జైపూర్ మండలంలోని టేకుమట్ల, షెట్పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో నాణ్యమైన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తోందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు తదితర అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు సకాలంలో తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్దే లక్ష్యం





**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్:** జిల్లాలో గిరిజన ప్రాంతాల అభ్యున్నతి కోసం వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల చేపట్టనున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం నీతి ఆయోగ్ సీఈఓ అధ్యక్షతన, సంబంధిత అదనపు కార్యదర్శులతో కలిసి నిర్వహించిన 49వ ఈసీ సమావేశంలో కలెక్టరేట్ లోని ఎన్ఐసి విసి హాల్ నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆదిలాబాద్ జిల్లా పరిపాలన విభాగం సమర్పించిన రూ.5.79 కోట్ల విలువైన ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమగ్ర నివేదికను వివరిస్తూ, జిల్లాలో గిరిజన ప్రాంతాల అభ్యున్నతి కోసం వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టనున్నామని తెలిపారు. అందులో భాగంగా నార్నూర్ బ్లాక్లో శాస్త్రీయ పద్ధతులు, మార్కెట్ లింకేజీల ద్వారా ల్యాక్ (లక్క) సాగును ప్రోత్సహించడానికి రూ.40లక్షల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 12 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైందని, ప్రస్తుతం మరో 8 గ్రామాలకు విస్తరించి మొత్తం 20 గ్రామాల్లో దీనిని అమలు చేయనున్నట్లు వివరించారు. ఈ ల్యాక్ సాగు ద్వారా సుమారు 370 గిరిజన కుటుంబాలకు లబ్ధి చేకూరడమే కాకుండా, ఏడాదికి రూ.15లక్షల పెట్టుబడితో దాదాపు రూ.21లక్షల ఆదాయం లభిస్తుందని తెలిపారు. గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ ద్వారా దీనికి మార్కెట్ సదుపాయం కల్పిస్తున్నామని, రైతులకు అవసరమైన సాంకేతిక శిక్షణను ఫారెస్ట్ డిపార్ట్మెంట్, సాంకేతిక శిక్షణ సంస్థల సహకారంతో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలో వాతావరణ మార్పులను తట్టుకునేలా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి రూ.3.8 కోట్ల వ్యయంతో 'వాడీ సాగు, సమగ్ర వ్యవసాయ ప్రాజెక్టు' క్రింద బోర్ వెల్స్ రీఛార్జ్ నిర్మాణాలు, ఫార్మ్ పాండ్స్, తోటల పెంపకం వంటి పనుల చేపట్టనున్నామని తెలిపారు. ఇప్పటికే 90 ఎకరాల్లో దీనిని పైలట్ ప్రాజెక్టుగా విజయవంతంగా అమలు చేశామని, తద్వారా 286 మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ మూడు అంచెల సాగు విధానం ద్వారా రైతులకు స్వల్పకాలికంగా కూరగాయల సాగుతో ఏడాదికి రూ.40వేల నుంచి రూ.60వేల వరకు, ఉద్యానవన పంటల ద్వారా దీర్ఘకాలికంగా రూ.60వేల నుంచి రూ.2లక్షల వరకు వార్షిక ఆదాయం లభిస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టుకు కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యానవన పరిశోధనా సంస్థలు, ఐటీడీఏ నర్సరీల ద్వారా అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు ఆయన ఉన్నతాధికారులకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్డీఓ రవీందర్, నీతి ఆయోగ్ ప్రోగ్రాం అధికారి రాహుల్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'

- **టూరిజం కోర్సుల పోస్టర్లు ఆవిష్కరణ, విద్యార్థులకు పోటీలు**



**ఆదిలాబాద్:** జిల్లాలో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్లోని విసి హాల్ లో యువ టూరిజం క్లబ్స్, హెరిటేజ్ డిపార్ట్మెంట్కు సంబంధించిన ఆన్లైన్ సర్టిఫికేట్ కోర్సుల పోస్టర్లను అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో మైనారిటీ సంక్షేమ అధికారి కలీం, జిల్లా పర్యాటక శాఖ అధికారి రవి కుమార్, భూభారతి కోఆర్డినేటర్ స్వాగత్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా బిసి స్టడీ సర్కిల్ లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ పాల్గొని మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా పర్యాటక రంగానికి ఎంతో అనువైన ప్రాంతమని, స్థానిక పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను విద్యార్థులందరూ తప్పక తెలుసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన జలపాతాలు, ప్రాచీన దేవాలయాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ లైబ్రరీ, స్టడీ హాల్ విద్యార్థులకు 'జిల్లా టూరిజం' అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించగా, దాదాపు 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నరని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీ విభాగంలో పోశెట్టి ప్రథమ, హీరామణి ద్వితీయ, వరుణ్ తృతీయ బహుమతులు, అలాగే ఉపన్యాస పోటీల్లో హీరామణి ప్రథమ, ప్రియాంక ద్వితీయ, ప్రనూష తృతీయ బహుమతులుగా భారత రాజ్యాంగం, జనరల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డీఎస్సీ కి సంబంధించిన విలువైన పుస్తకాలను అదనపు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి సోనియా, జిల్లా టూరిజం శాఖ అధికారి రవికుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్బంధం

- **దగ్ధమైన ట్రాక్టర్ యజమానికి పరిహారం ఇవ్వాలని గ్రామస్తుల డిమాండ్**



**తాండూర్:** మండలంలోని అచలాపూర్ లో ఆదివారం జరిగిన ట్రాక్టర్ దగ్ధం సంఘటనలో విద్యుత్ అధికారులు వ్యవహరించిన తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు. వేలాడే కరెంట్ తీగలు, వంగిన స్తంభాల కారణంగానే ప్రమాదం సంభవించిందని, పేద రైతు ట్రాక్టర్ దగ్ధమైందని గ్రామస్థులు, రైతులు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కారణాలు తెలుసుకోవడానికి సోమవారం గ్రామానికి వచ్చిన విద్యుత్ శాఖ ఏఈ జాన్, లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, జూనియర్ లైన్మెన్ మహదేవ్ ను నాలుగు గంటల పాటు నిర్బంధించి పరిహారం కోసం డిమాండ్ చేశారు. గ్రామంలో దాదాపుగా 15 దారుల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ వాహనాలకు, ఎడ్లబండ్లకు కూడా తాకే విధంగా ఉన్నాయని, మరమ్మతులు చేపట్టాలని కొన్ని నెలలుగా చెబుతున్నప్పటికీ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆదివారం నాటి ప్రమాదంలో డ్రైవర్, మరో యువ రైతు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో లైన్ మెన్ రైతులకు, ప్రజలకు ఫోన్లో కూడా స్పందించడని ఆరోపించారు. జరిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలని, గ్రామంలో వేలాడే తీగల మరమ్మతులను వెంటనే ప్రారంభించి ప్రమాదాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పైఅధికారులకు విషయం తెలియజేస్తానని చెప్పగా అందుకు స్థానికులు అభ్యంతరం తెలిపి ఇప్పటికిప్పుడే పరిహారం విషయం తేల్చాలంటూ అధికారులను కదలనీయకుండా ఘెరావ్ చేశారు. విషయం తెలుసుకున్న తాండూర్ ఎస్సై ప్రసాద్ అక్కడికి చేరుకుని స్థానికులతో పాటు అధికారితో మాట్లాడారు. రెండు, మూడు నెలల్లో ట్రాక్టర్ యజమానికి పరిహారం ఇప్పించడానికి ప్రతిపాదనలు పంపిస్తామని డీఈఈ ఫోన్లో చెప్పడంతో స్థానికులు శాంతించారు. ఈ వర్షాకాలం ప్రారంభానికి ముందే గ్రామంలో విద్యుత్ లైన్లు పూర్తి స్థాయి మరమత్తులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానిక నాయకులు, రైతులు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అచలాపూర్ ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మార్శెట్టి శ్రీనివాస్, కొండ సాయి, మాజీ ఉప సర్పంచ్ అడ్వాల్ల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి


- **మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మ దేవేందర్ రెడ్డి.**



**మెదక్**

మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్ గ్రామంలో సోమవారం శ్రీనల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ జాతర ఉత్సవాలలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్నారు. అనంతరం నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు జాతరలు ప్రతీకలని అన్నారు.నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో జాతర ఉత్సవాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జాతరను జరుపుకోవడం సంతోషకరమన్నారు. రైతులకు మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని,ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ జాతర కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పద్మ దేవేందర్ రెడ్డికి మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షుడు ఎం. అంజగౌడ్, మాజీ ఎంపీపీ కిష్టయ్య,, గ్రామ పార్టీ అధ్యక్షుడు సత్య గౌడ్, గ్రామ ఉప సర్పంచ్ బండామీది దుర్గయ్య, మాజీ సర్పంచ్ గట్టయ్య, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, మాజీ సర్పంచ్ అశోక్, ముష్టి పెద్ద గంగయ్య,, రాజల్ పేట గట్టయ్య మంగలి ఆంజనేయులు, శాకానోళ్ల అంజయ్య,,శ్రీధర్ రెడ్డి,,మెదక్ మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ ఎంబిపూర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పుచ్చకాయ తింటూ గింజలు మింగేశారా?



వేసవిలో అధికంగా లభించే పుచ్చకాయలు రుచిగా ఉండటమేకాకుండా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎన్నో విధాలుగా సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉండటానికి పుచ్చకాయ తినడం తప్పనిసరి. తీవ్రమైన వేడిలో శరీరాన్ని తాజాగా ఉంచడానికి పుచ్చకాయ కంటే మంచిన మరో ప్రత్యామ్నాయం లేదంటే అతిశయోక్తి కాదు. వేసవిలో పుచ్చకాయలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి రుచిగా ఉండటమేకాకుండా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎన్నో విధాలుగా సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉండటానికి పుచ్చకాయ తినడం తప్పనిసరి. తీవ్రమైన వేడిలో శరీరాన్ని తాజాగా ఉంచడానికి పుచ్చకాయ కంటే మంచిన మరో ప్రత్యామ్నాయం లేదంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే పుచ్చకాయలో 92 శాతం నీరు ఉంటుంది. ఇందులో విటమిన్లు, ఐరన్ కూడా పుష్కలంగా ఉంటాయి. పుచ్చకాయలో కేలరీల స్థాయి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల మధుమేహ రోగులు కూడా పుచ్చకాయ హాయిగా తినవచ్చు. కాబట్టి ఎండ వేడిమికి చర్మం కమిలిపోకుండా ఉండాలంటే తియ్యని పుచ్చకాయ ముక్కలు తినాల్సిందే. ఫలితంగా మీ శరీరం ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటుంది. పుచ్చకాయ మాత్రమే కాదు పుచ్చకాయ గింజలు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చాలా మంది పుచ్చకాయ తినేటప్పుడు పొరపాటున గింజలను మింగేస్తుంటారు. దీనికి భయపడాల్సిన అవసరం లేదు. నిజానికి ఇది పొరపాటు కాదని నిపుణులు చెబుతున్నారు. పైగా పుచ్చకాయ గింజలను నేరుగా కూడా తినవచ్చు. పుచ్చకాయ గింజలలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా పుచ్చకాయ గింజలు ఆహారం త్వరగా జీర్ణం కావడానికి కూడా సహాయపడతాయి. చర్మంపై ముడతలను తగ్గించడానికి లేదా చర్మపు కాంతిని పెంచడానికి పుచ్చకాయ గింజలు అద్భుతంగా పనిచేస్తాయి. పుచ్చకాయ ముక్కలుగా కట్ చేసి, దాని గింజలను వేరు చేయాలి. ఆ తర్వాత దానిని ఎండలో ఆరబెట్టి, పొడి పెనంలో వేయించాలి. ఈ గింజలను నేరుగా నమిలి తినవచ్చు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత లేదా భోజనం తర్వాత తినవచ్చు. బరువు తగ్గాలనుకునేవారు మధ్యాహ్నం పూట చిరుతిండిగా పుచ్చకాయ గింజలను తినవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఆకలి తక్కువగా అనిపించి, వేగంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అలాగే అన్నంతో పాటు పుచ్చకాయ గింజలను కూడా తినవచ్చు. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

# ఏ విటమిన్ ఏ వ్యాధి నుంచి రక్షిస్తుంది?




విటమిన్లు అనేవి శరీరంలోని దాదాపు అన్ని విధులలో కీలక పాత్ర పోషించే ఆవశ్యక పోషకాలు. వాటి లోపం అనేక సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల, ఏ విటమిన్లు ఏ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయో అర్థం చేసుకోవడం ముఖ్యం. విటమిన్లు శరీరానికి అవ-సరమైన పోషకాలు.. ఇవి మన మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. శరీరానికి శక్తిని అందించడానికి, అవ-యవాల సరైన పనితీరును నిర్వహించడానికి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహా-యపడతాయి. ప్రతి విటమిన్‌కు ఒక ప్రత్యేకమైన పని ఉంటుంది.. ఉదాహరణకు ఎముకలను బలోపేతం చేయడం.. మరికొన్ని చర్మ, కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

శరీరం చాలా విటమిన్లను స్వయంగా ఉత్పత్తి చేసుకోలేదు. కాబట్టి వాటిని ఆహారం ద్వారా పొందడం చాలా అవసరం. ఈ విటమిన్ల లోపం వివిధ ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. తగినంత మోతాదులో విటమిన్లను తీసుకోవడం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా, అనేక వ్యాధులను నివారిస్తుంది.. శరీర పనితీరును మెరుగుపరుస్తుంది. అందువల్ల, సమతుల్య ఆహారంలో విటమిన్లను చేర్చడం చాలా కీలకం. ఏ విటమిన్లు ఏ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి.. ఎముకలు, కండరాల బలానికి విటమిన్ డి, బి12 చాలా అవసరం.. అవి బలాన్ని అందించి, బలహీనత, ఎముకలకు సంబంధించిన సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. విటమిన్ ఎ, విటమిన్ ఇ దృష్టి, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలోనూ, కళ్ళను రక్షించడంలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. గుండె, మెదడు సరిగ్గా పనిచేయడానికి విటమిన్ బి6, బి12 చాలా అవసరం. అవి రక్త ప్రసరణను మెరుగుపరిచి, మానసిక ఆరోగ్యానికి తోడ్పడతాయి. విటమిన్ లోపాలను గుర్తించడానికి నిర్దిష్ట రక్త పరీక్షలు నిర్వహిస్తారు. వీటిలో విటమిన్ డి, విటమిన్ బి12, ఐరన్ ప్రొఫైల్, కాల్షియం పరీక్షలు ఉంటాయి. మీ లక్షణాల ఆధారంగా వైద్యులు తగిన పరీక్షలను సిఫార్సు చేస్తారు. ఒక వ్యక్తికి తరచుగా అలసట, నీరసం, జుట్టు రాలడం లేదా చర్మ సమస్యలు వంటివి కనిపిస్తే, అది విటమిన్ లోపానికి సంకేతం కావచ్చు. క్రమం తప్పని వైద్య పరీక్షలు ఈ పరిస్థితిని నిర్ధారించి, తగిన చికిత్సను ప్రారంభించడానికి సహా-యపడతాయి.

# ఈ పండ్లు తిన్నారంటే రోజంతా ఫుల్ ఖుష్



వేసవిలో చాలా మందికి నిస్సత్తువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఈ సమయంలో శరీరాన్ని ఎంత చల్లగా, తాజాగా ఉంచుకోవడానికి చాలా మంది శీతల పానియాలు, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకుంటూ ఉంటారు. అయితే ఎండలో చెమట రూపంలో ఒంట్లోని నీరంతా ధారగా కారుతుంది. దీని కారణంగా డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. వేసవిలో మండే ఎండలు త్వరగా శక్తిని కోల్పోయేలా చేస్తాయి. దీంతో నిస్సత్తువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఈ సమయంలో శరీరాన్ని ఎంత చల్లగా, తాజాగా ఉంచుకోవడానికి చాలా మంది శీతల పానియాలు, కొబ్బరి నీళు వంటివి తీసుకుంటూ ఉంటారు. అయితే ఎండలో చెమట రూపంలో ఒంట్లోని నీరంతా ధారగా కారుతుంది. దీని కారణంగా డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. వేసవిలో వచ్చే ఈ సమస్య నుంచి బయటపడటానికి అధిక నీటితో పాటు కొన్ని రకాల పండ్లను కూడా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పండ్లను తినడం ద్వారా శరీరంలో తగినంత నీటి శాతాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది. నారింజ పండ్లు నీరు అధిక శాతం ఉండే పండ్లు. వీటిల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వీటిలోని అధిక నీటి శాతం వేడి వాతావరణంలో శరీరానికి మంచి హైడ్రేషన్‌ను అందిస్తుంది. అంతేకాకుండా వాటిలోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. వేసవిలో డీహైడ్రేషన్‌ను నివారించడానికి, శరీరంలో నీటి శాతాన్ని నిలుపుకోవడానికి పుచ్చకాయలను తినడం మంచి ఎంపిక. ఇందులో 92 శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది వేసవికి అనువైన పండు. ఇది శరీరానికి తేమను అందించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. స్ట్రాబెర్రీలు తినడానికి రుచికరంగా ఉండటమే కాకుండా వాటిలో మంచి మొత్తంలో నీరు కూడా ఉంటుంది. విటమిన్ సిచ యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల స్ట్రాబెర్రీలు శరీరాన్ని ఫ్రీ రాడికల్ నష్టం నుంచి, వేడి నుంచి కాపాడతాయి. వేసవిలో దొరికే సీజనల్ పండ్లలో పనస ముఖ్యమైనది. ఇది మంచి సువాసనతో పాటు ఎన్నో మేలు చేసే పోషకాలు దండిగా కలిగి ఉంటుంది. తినడానికి ఈ పండు రుచికరంగా ఉండటమే కాకుండా, శరీరానికి తేమను కూడా అందిస్తుంది. అంతేకాకుండా అనాస పండులో మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ముఖ్యమైన పోషకాలు దండిగా ఉంటాయి. కీరదోసలో 96 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరానికి మంచి హైడ్రేషన్‌ను అందిస్తుంది. కాబట్టి ఈ వేసవిలో ప్రతిరోజూ కీరదోస సలాడ్, లేదా జ్యూస్ ఎలా తీసుకున్నా మంచిదే.

# కొబ్బరి నీళ్లలో ఈ గింజలు వేసుకుని తాగితే అమృతమే..



ఉదయం ఎనిమిది దాటిందంటేనే సూర్యుడు సెగలు గక్కుతున్నాడు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోత, విపరీతమైన చెమట మనలోని శక్తిని నిలువునా లాగేస్తున్నాయి. కేవలం నీళ్లు తాగినా తీరని దాహం.. ఇలాంటి తరుణంలో కోల్పోయిన శక్తిని తిరిగి ఇచ్చే ఎలక్ట్రోలైట్లు, శరీరాన్ని లోపలి నుండి చల్లబరిచే ఔషధం కావాలి. అదే కొబ్బరి నీరు - సబ్జా గింజల అద్భుత కలయిక. భానుడి భగభగలు మొదలయ్యాయి. వేసవి తీవ్రత పెరగడంతో అధిక చెమట, తీవ్రమైన అలసట, నీరసం సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం ఒక పెద్ద సవాలుగా మారింది. అయితే ప్రకృతి ప్రసాదించిన కొబ్బరి నీరు, చలువ చేసే సబ్జా గింజల మిశ్రమంతో ఈ సమస్యలకు సులువుగా చెక్ పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. డీహైడ్రేషన్‌కు అద్భుత పరిష్కారం: ఎండల వల్ల శరీరంలోని ఎలక్ట్రోలైట్లు వేగంగా తగ్గిపోతాయి. కొబ్బరి నీటిలో ఉండే పొటాషియం, సోడియం, మెగ్నీషియం శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. వీటికి సబ్జా గింజలను జత చేస్తే, అవి నీటిని పీల్చుకుని జెల్ లాగా మారి, శరీరంలో ఎక్కువ సేపు తేమను నిలుపుతాయి. తద్వారా అలసట మాయమై, శరీరం రీఛార్జ్ అవుతుంది. జీర్ణక్రియకు రక్షణ కవచం: వేసవిలో వచ్చే గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలకు ఈ పానీయం ఒక దివ్యౌషధం. సబ్జా గింజల్లో ఉండే అధిక పీచుపదార్థం పేగులను శుభ్రపరిచి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొబ్బరి నీరు కడుపులోని మంటను తగ్గించి, ఎసిడిటీని నియంత్రణలో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి వరం: ఊబకాయం లేదా అధిక బరువుతో బాధపడేవారికి ఇది ఉత్తమ ఎంపిక. సబ్జా గింజలు తీసుకున్నప్పుడు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి, దీనివల్ల అతిగా తినే అలవాటు తగ్గుతుంది. కొబ్బరి నీటిలో కేలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉండదు. చర్మ సౌందర్యం.. రెట్టింపు శక్తి: ఈ మిశ్రమం కేవలం ఆరోగ్యానికే కాదు చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపడం ద్వారా చర్మం కాంతివంతంగా మారుతుంది. మధ్యాహ్న సమయంలో ఈ పానీయం తీసుకోవడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. కాబట్టి కూల్ డ్రింక్స్, సోడాల వంటి కృత్రిమ పానీయాల కంటే.. సహజసిద్ధమైన ఈ కొబ్బరి నీరు-సబ్జా గింజల మిశ్రమాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ఈ వేసవిని ఆరోగ్యంగా ఎదుర్కోవచ్చు.

# బూడిద గుమ్మడి కాయ జ్యూస్ తాగుతున్నారా?





ఈ మధ్యకాలంలో బూడిద గుమ్మడికాయ జ్యూస్ ట్రెండింగ్‌లో ఉంది. చాలామంది ఉదయాన్నే పడిగడుపున దీనిని తాగుతున్నారు. అయితే.. బూడిద గుమ్మడి జ్యూస్ తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పచ్చి కూరగాయల జ్యూస్‌లలో ఉండే ఆక్సిలేట్‌లు ఈ సమస్యకు కారణం కావచ్చు. యాంటీ-న్యూట్రియంట్‌లను తగ్గించడానికి ఉడకబెట్టి తాగడం ఉత్తమం. బూడిద గుమ్మడికాయ జ్యూస్ ఈ మధ్యకాలంలో చాలా ట్రెండీగా మారింది. ఆరోగ్యం కోసం చాలా మంది దీన్ని ఉదయాన్నే పడిగడుపున తాగుతున్నారు. అయితే, దీని వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలు, సురక్షితమైన వినియోగం గురించి అవగాహన ఉండటం చాలా ముఖ్యమంటు న్నారు ఆయుర్వేద నిపుణులు.. అన్ని కూరగాయలలో యాంటీ- న్యూట్రియంట్స్ ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ఇవి శరీరంలో విటమిన్ శోషణ, జీర్ణక్రియను ప్రభావితం చేయవచ్చు. బూడిద గుమ్మడికాయలో ఆక్సిలేట్స్ అనే యాంటీ-న్యూట్రియంట్ అధికంగా ఉంటుంది. సుమారు 300-400 గ్రాముల బూడిద గుమ్మడికాయ ముక్కల నుండి తీసిన 200-300 ఎశ్రీ పచ్చి జ్యూస్‌లో ఆక్సిలేట్ల సాంద్రత చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ అధిక ఆక్సిలేట్ కంటెంట్ మనం ఆహారం ద్వారా తీసుకునే కాల్షియంతో కలిసి కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే అవకాశాన్ని పెంచుతుందని పేర్కొంటున్నారు. ఇది అందరికీ రాకపోయినా, కొంతమందిలో ఆరోగ్య సమస్యలను సృష్టించగలదు. అందుకే, పడిగడుపున పచ్చి జ్యూస్ తాగడం అనేది అందరికీ సరైనది కాదని హెచ్చరిస్తున్నారు. ఆక్సిలేట్ కంటెంట్‌ను తగ్గించడానికి బూడిద గుమ్మడికాయను ఉడకబెట్టి లేదా కొద్దిగా వేగించి జ్యూస్ చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. ఇలా చేయడం వల్ల దానిలోని యాంటీ-న్యూట్రియంట్ ప్రొఫైల్ తగ్గి, విటమిన్లు ? ఖనిజాలు శరీరానికి మంచిగా అందుతాయి. పచ్చి కూరగాయల జ్యూస్‌లు దీర్ఘకాలంలో చెడు ప్రభావాలు చూపవచ్చని పేర్కొంటున్నారు.. శరీరాన్ని డిటాక్స్ చేస్తుందని చెప్పి అనేక రకాల జ్యూస్‌లను ప్రచారం చేస్తున్నారు. అయితే, కిడ్నీలు, లివర్, లింఫాటిక్ సిస్టం, చర్మం వంటి మన శరీర అవయవాలు సహజంగానే శరీరాన్ని డిటాక్స్ చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డిటాక్స్ జ్యూస్‌లు అనేది ఒక స్కామ్ అని, శరీరానికి నిజంగా ఏదైనా సమస్య ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలని, జ్యూస్‌లు తాగడం వల్ల లాభం లేదని సూచిస్తున్నారు. సరైన జీవనశైలి, అంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం ద్వారా శరీరం దాని డిటాక్సిఫికేషన్ ప్రక్రియను సమర్థవంతంగా



# ప్రత్యేకతల సమాహారం

## నీలం సంజీవరెడ్డి రాజకీయ ప్రస్థానం

**నేడు దేశ అత్యున్నత దివంగత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి**

**భారత రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఏకైక అరుదైన రికార్డు**

**స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన ఆదర్శ నేత.. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి**

భారత రాజకీయ యవనికపై నీలం సంజీవరెడ్డి ఒక విలక్షణమైన, నిరుపమానమైన నాయకుడు. మే 19న ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుని సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని స్మరించుకోవడం తెలుగువారికే కాదు, దేశ ప్రజలందరికీ గర్వకారణం. భారత దివంగత రాష్ట్రపతి సంజీవరెడ్డి రాజకీయ జీవితం అనేక ఒడిదుడుకులు, విజయాలు, అపజయాలు, త్యాగాలు, సాహసోపేత నిర్ణయాలు మరియు రాజకీయ ఎత్తుగడల సమాహారం. 1940ల నుండి 1970ల వరకు అటు రాష్ట్ర, ఇటు దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ప్రతి ముఖ్య సంఘటనతోనూ ఆయనకు ప్రత్యక్ష సంబంధం ఉంది.

### స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన ఆదర్శ నేత

భారత పార్లమెంటరీ చరిత్రలోనే లోక్‌సభ సభాపతిగా ఎన్నిక కాగానే, సభ నిష్పాక్షికతను కాపాడటం కోసం తన సొంత పార్టీ (కాంగ్రెస్) ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన మొదటి స్పీకర్ నీలం సంజీవరెడ్డి కావడం విశేషం. అధికార, ప్రతిపక్షాల మధ్య సమన్వయం సాధిస్తూ ఆయన స్పీకర్ పదవికే వన్నె తెచ్చారు. లోక్‌సభ సభాపతిగా రెండు సార్లు ఎన్నికై, రెండుసార్లూ దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకై స్పీకర్ పదవికి రాజీనామా చేసిన అరుదైన చరిత్ర కూడా ఆయన సొంతం.

### రైతు బిడ్డ నుండి రాజ్యాంగ అధినేత వరకు

అనంతపురం జిల్లా ఇల్లూరు గ్రామంలో 1913, మే 19న ఒక సాధారణ రైతు కుటుంబంలో సంజీవరెడ్డి జన్మించారు. మద్రాసు దివ్యజ్ఞాన సమాజం పాఠశాల, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఆయన విద్యాభ్యాసం సాగింది. 1929లో మహాత్మా గాంధీ పిలుపుతో స్ఫూర్తి పొంది, చదువును పక్కనపెట్టి స్వాతంత్ర్య పోరాటంలో దూకారు. 1937లో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెసు కమిటీకి కార్యదర్శిగా ఎన్నికై పదేళ్లపాటు కొనసాగారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 1940–1945 మధ్య కాలంలో ఎక్కువ భాగం జైలు జీవితం గడిపారు. 1946లో మద్రాసు శాసనసభకు, 1947లో రాజ్యాంగ నిర్మాణ సంఘానికి (రాజ్యాంగ సభ) ఎన్నికయ్యారు.

### పదవులను త్యాగం చేసిన ఉదాత్తుడు:

సంజీవరెడ్డి పదవుల కోసం ఎన్నడూ ఆరాటపడలేదు. 1953లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు ముఖ్యమంత్రి పదవి ఆయనకు దక్కాల్సి ఉన్నా, నాటి రాజకీయ పరిణామాల దృష్ట్యా టంగుటూరి ప్రకాశం పంతులు కోసం తప్పుకుని ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మళ్లీ 1955లో బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు మార్గం సుగమం చేస్తూ రెండోసారి కూడా ఉప ముఖ్యమంత్రి పదవికే పరిమితమయ్యారు. ఆంధ్రప్రదేశ్ అవతరణలోనూ, పెద్దమనుషుల ఒప్పందంపై సంతకం చేయడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఏపీ ఏర్పడిన తర్వాత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1960లో అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. తిరిగి 1962లో రెండోసారి ఏపీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, రవాణా సంస్థల జాతీయీకరణ వివాదంలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టడంతో, నైతిక బాధ్యత వహిస్తూ 1964 ఫిబ్రవరి 29న తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి రాజకీయ విలువలను చాటుకున్నారు.

### ఓటమి నుండి ఏకగ్రీవ రాష్ట్రపతి వరకు:

ఆ తర్వాత కేంద్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ ప్రభుత్వాలలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. 1969లో కాంగ్రెస్ సీనియర్ నేతల నిర్ణయం మేరకు స్పీకర్ పదవికి రాజీనామా చేసి రాష్ట్రపతి అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే నాటి ప్రధాని ఇందిరా గాంధీ "అంతరాత్మ ప్రబోధం" నినాదంతో కాంగ్రెస్ అంతర్గత కుట్రల వల్ల స్వతంత్ర అభ్యర్థి, మరో తెలుగు ప్రముఖుడు వి.వి. గిరి చేతిలో కేవలం 14,650 ఓట్ల స్వల్ప తేడాతో సంజీవరెడ్డి ఓడిపోయారు. ఆ తర్వాత రాజకీయాలకు కొంతకాలం దూరమైనా, 1975లో జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమంతో మళ్లీ చురుకైన పాత్ర పోషించారు. ఎమర్జెన్సీ తర్వాత 1977 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కొట్టుకుపోయినా.. ఏపీలో మాత్రం 42 సీట్లకు గాను 41 స్థానాలు కాంగ్రెస్ గెలిచింది. కాంగ్రెసేతర జనతా పార్టీ తరపున గెలిచిన ఏకైక ఏపీ ఎంపీ నీలం సంజీవరెడ్డి కావడం ఆయన ప్రజాదరణకు నిదర్శనం. అనంతరం మళ్లీ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 1977లో అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ అకాల మరణంతో దేశ అత్యున్నత పదవికి ఎన్నిక అనివార్యమైంది. నాటి జనతా పార్టీ సంజీవరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగా, ప్రతిపక్షంలో ఉన్న ఇందిరా గాంధీ సైతం మద్దతు ప్రకటించడంతో.. భారత దేశ చరిత్రలోనే 'ఏకగ్రీవంగా' ఎన్నికైన ఏకైక రాష్టపతిగా నీలం సంజీవరెడ్డి సరికొత్త రికార్డు సృష్టించారు. 1982లో పదవీ కాలం ముగిశాక రాజకీయాల నుండి శాశ్వతంగా దూరమై బెంగళూరులో స్థిరపడిన ఆయన, 1996 జూన్ 1న కన్నుమూశారు. పదవులకు వన్నె తెచ్చిన నిగర్వి, ఆదర్శ రాజనీతిజ్ఞుడు నీలం సంజీవరెడ్డి స్మృతికి నివాళులు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జలాంతర్గామి శక్తికి మూలస్తంభం

## ఐఎన్ఎస్ వీరబాహు

**నేడు భారత నౌకాదళ చరిత్రలో జలాంతర్గాముల తొలి స్థావరం ఆవిర్భవ దినం**

**శత్రువుల గుండెల్లో నిద్రపోయే 'సబ్‌మెరైన్' దళానికి విశాఖ తీరమే కేంద్ర బిందువు**

**1971 భారత్-పాక్ యుద్ధంలో కీలక పాత్ర.. నౌకాదళ ధైర్యానికి ప్రతీక**



**భారతీయ నౌకాదళ చరిత్రలో మే 19 ఒక కీలకమైన మైలురాయి. 1971 మే 19న విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ (ఈస్టర్న్ నావల్ కమాండ్) ప్రధాన కేంద్రంలో "ఐ.ఎన్.ఎస్. వీరబాహు" అనే ప్రత్యేకమైన జలాంతర్గాముల (సబ్‌మెరైన్స్) స్థావరం అధికారికంగా ప్రారంభమైంది. భారతదేశ జలాంతర్గామి దళానికి అత్యంత శక్తివంతమైన కేంద్రంగా మారిన ఈ స్థావరం.. సముద్ర గర్భంలో దేశ రక్షణ శక్తిని పెంచేందుకు భారత్ చేసిన మొదటి వ్యూహాత్మక ప్రయత్నాలలో ప్రధానమైనదిగా నిలిచింది.**

1960ల చివరి నాటికి సముద్ర రక్షణలో వ్యూహాత్మకంగా జలాంతర్గాముల ప్రాముఖ్యత ఎంతగానో పెరుగుతోందని భారత నౌకాదళం గుర్తించింది. సముద్రపు లోతుల్లో నిశ్శబ్దంగా ఉంటూ శత్రువుల కదలికలను పసిగట్టడం, వారిపై అకస్మాత్తుగా మెరుపు దాడి చేయగలగడం జలాంతర్గాముల ప్రత్యేకత. ఈ క్రమంలోనే 1967లో అప్పటి సోవియట్ యూనియన్ (రష్యా) నుండి భారతదేశం తన తొలి జలాంతర్గామి 'ఐ.ఎన్.ఎస్. కల్వరి'ని పొందింది. ఇది దేశ సముద్ర రక్షణ రంగాన్ని సరికొత్త శకానికి పరిచయం చేసింది. ఆ తర్వాత మరిన్ని జలాంతర్గాములు నౌకాదళంలో చేరడంతో.. వాటి నిర్వహణ, మరమ్మతులు, లాజిస్టిక్స్ మరియు సిబ్బంది శిక్షణ కోసం ఒక ప్రత్యేకమైన స్థావరం అత్యవసరమైంది. ఈ అవసరం నుంచే పుట్టుకొచ్చిందే 'ఐఎన్ఎస్ వీరబాహు'. 'వీరబాహు' అంటే ధైర్యవంతుని భుజం అని అర్థం. భారత పురాణాలలో శివుని కుమారుడైన కుమారస్వామి (కార్తికేయుడు)కి వీరబాహు నమ్మకమైన అనుచరుడిగా, సేనాధిపతిగా ప్రముఖ పాత్ర పోషించాడు. అతడి అసమాన ధైర్యాన్ని, నిస్సహాయులను కాపాడే రక్షణ శక్తిని సూచించేలా విశాఖలోని ఈ సబ్‌మెరైన్ బేస్‌కు 'ఐ.ఎన్.ఎస్. వీరబాహు' అని నామకరణం చేశారు. ఇది మన నావికుల శౌర్యానికి, సామర్థ్యానికి నిలువెత్తు ప్రతీకగా నిలుస్తోంది.

### నానాటికీ విస్తరించిన సేవా విభాగాలు

ప్రారంభ దశలో ఈ స్థావరం కేవలం 8వ జలాంతర్గామి స్క్వాడ్రన్‌కు మద్దతు కేంద్రంగా మాత్రమే పనిచేసింది. జలాంతర్గాములకు అవసరమైన సాంకేతిక మరమ్మతులు, వసతి, శిక్షణ సౌకర్యాలన్నింటినీ ఇది సమకూర్చేది. కాలక్రమేణా భారత నౌకాదళంలో జలాంతర్గాముల సంఖ్య పెరగడంతో ఈ స్థావరం బాధ్యతలు కూడా విస్తరించాయి. దీని నిర్వహణ అధికారం మొదట "కెప్టెన్ సబ్‌మెరైన్స్" నుండి "కమోడోర్ సబ్‌మెరైన్స్"కు, ఆ తర్వాత 1997లో "కమోడోర్ కమాండింగ్ సబ్‌మెరైన్స్ (ఈస్ట్)"గా రూపాంతరం చెందింది. ప్రస్తుతం తూర్పు నౌకాదళంలోని అన్ని జలాంతర్గాముల కార్యకలాపాలకు ఇదే ప్రధాన కేంద్రం.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

### 1971 యుద్ధంలో వీరోచిత పాత్ర

ఐఎన్ఎస్ వీరబాహు స్థాపించబడిన కొద్ది నెలలకే 1971లో భారత్--పాకిస్తాన్ మధ్య యుద్ధం సంభవించింది. ఆ సమయంలో ఈ స్థావరం నౌకాదళానికి వెన్నెముకగా నిలిచింది. ఇక్కడి నుంచే వ్యూహాలు రచించి, ఐ.ఎన్.ఎస్. కురుసురా వంటి జలాంతర్గాములు శత్రువుల పాలిట యమపాశాలుగా మారి దేశ రక్షణలో అద్భుత విజయాన్ని అందించాయి. నాటి ఆ బలిష్టమైన పునాది వల్లే, నేడు భారత నౌకాదళం అణు జలాంతర్గాములు వంటి అత్యాధునిక నౌకాశక్తిని కలిగి ఉంటూ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవగలిగింది. తూర్పు తీరానికి ఒక రహస్య రక్షణ గోడలా నిలిచే ఐ.ఎన్.ఎస్ వీరబాహు.. కేవలం సబ్‌మెరైన్లకు మద్దతు ఇవ్వడమే కాకుండా శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానంలో నిపుణులను తయారుచేసే దిక్సూచిగా మారింది. సముద్ర ఉపరితలంపైనే కాకుండా సముద్ర గర్భంలోనూ భారత సార్వభౌమాధికారాన్ని చాటిచెప్పే ఈ శక్తిపీఠం, భవిష్యత్తులో దేశ రక్షణ వ్యూహాలలో మరింత కీలక పాత్ర పోషిస్తూ నూతన శకానికి దారి చూపిస్తోంది.

# నిబద్ధతకు ప్రతిరూపం పుచ్చలపల్లి

**ఆయన ఒక వీర స్వాతంత్ర్య సమరయోధుడు.. నిఖార్సయిన కమ్యూనిస్టు నాయకుడు.. వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట గమనాన్ని మార్చిన మహా యోధుడు.. సమసమాజం కోసం జీవితాంతం శ్రమించిన విప్లవకారుడు. సమాజంలో వేళ్లూనుకున్న కుల వ్యవస్థను తీవ్రంగా నిరసించి, తన పేరులోని కులాన్ని సూచించే పదాన్ని తొలగించుకున్న ఆదర్శవాది. ప్రజా ఉద్యమాల కోసం తన వాటా కింద వచ్చిన యావదాస్తిని పార్టీకి, ప్రజా పోరాటాలకే ధారపోసిన మార్గదర్శి. ప్రజలకు, విప్లవానికి పూర్తి కాలం సేవ చేయాలనే ఉద్దేశంతో.. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న అసాధారణ త్యాగశీలి. ఇలా పేర్కొంటూ వెళితే పేజీలు చాలవు. ఆయనే కమ్యూనిస్టుల గుండెల్లో కామ్రేడ్ "పి.ఎస్"గా నిలిచిన, దేశవ్యాప్తంగా "కమ్యూనిస్టు గాంధీ"గా పేరొందిన పక్కా ప్రజా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే 1) నాడు జన్మించి, శ్వాస విడిచే వరకు మార్క్సిజం, కమ్యూనిజం సిద్ధాంతాలకే అంకితమైన సుందరయ్య వర్ధంతి సందర్భంగా ప్రత్యేక స్మరణ.**

**కమ్యూనిస్టు గాంధీ సుందరయ్య సంస్మరణ**

**నేడు నిరాడంబరతకు నిలువెత్తు సాక్ష్యం, కామ్రేడ్ 'పి.ఎస్' వర్ధంతి**

**సమసమాజ స్థాపన కోసం యావదాస్తిని త్యాగం చేసిన మహనీయుడు**

**రెడ్డి అనే కుల తోకను కత్తిరించుకొని, సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లిన ఆదర్శమూర్తి**



భూస్వామ్య కుటుంబం నుండి విప్లవ పంథా వైపు:

పుచ్చలపల్లి సుందరయ్య శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం అలగానిపాడు గ్రామంలో ఒక సంపన్న భూస్వామ్య కుటుంబంలో 1913 మే 1న జన్మించారు. తండ్రి వెంకటరామిరెడ్డి, తల్లి శేషమ్మ. వారికి పుట్టిన సుందరరామిరెడ్డి.. ఆరేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయారు. ప్రాథమిక విద్య వీధిబడిలోనే సాగగా, ఆపై తిరువళ్లూరు, ఏలూరు, రాజమండ్రి, మద్రాసులలో ఉన్నత చదువులు చదివారు. మహాత్మా గాంధీ నాయకత్వానికి ఆకర్షితుడైన సుందరయ్య.. 1930లో తన 17వ ఏట పాఠశాల రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలు, ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణోద్యమాల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. నిజామాబాద్ బోర్స్టల్ స్కూల్‌లో శిక్ష అనుభవిస్తున్న కాలంలోనే ఆయనకు కమ్యూనిస్టులతో పరిచయం ఏర్పడింది. విడుదలయ్యాక తన స్వగ్రామంలో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేస్తూ.. అమీర్ హైదర్ ఖాన్ స్ఫూర్తితో నాటి నిషేధిత భారతీయ కమ్యూనిస్టు పార్టీ (ఙూ×)లో చేరారు.

### దక్షిణాదిలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత:

అమీర్ హైదర్ ఖాన్ అరెస్టు అనంతరం దక్షిణాదిలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించే గురుతర బాధ్యతను పార్టీ కేంద్ర కమిటీ సుందరయ్యకే అప్పగించింది. ఆయన చొరవతో కేరళకు చెందిన ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్, కృష్ణ పిళ్లై వంటి నాయకులు కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చారు. సుందరయ్య ఆంధ్ర ప్రాంతంలో తొలి కమ్యూనిస్టు శాఖను స్థాపించి, 1936లో అఖిల భారత కిసాన్ సభ ఏర్పాటులో కీలక పాత్ర పోషించి దానికి సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటీషు ప్రభుత్వం పార్టీని నిషేధించడంతో 1939 నుండి 1942 వరకు నాలుగేళ్ల పాటు అజ్ఞాతంలో గడిపారు.

### తెలంగాణ సాయుధ పోరాట సారథి:

1943లో పార్టీపై నిషేధం తొలగాక బొంబాయి, కలకత్తా పార్టీ కాంగ్రెస్‌లలో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. కలకత్తా సమావేశంలో ఆమోదించిన "కలకత్తా థీసిస్" సాయుధ పోరాటాన్ని సమర్థించింది. ఈ క్రమంలోనే నిజాం నిరంకుశత్వానికి, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా చారిత్రాత్మక 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ఉధృతమైంది. ఈ వీరోచిత పోరాటానికి సుందరయ్యే ప్రధాన వ్యూహకర్త, సర్వ సైన్యాధ్యక్షుడిగా నిలిచారు. పోరాట చివరి దశలో 1948 నుండి 1952 వరకు ఆయన అజ్ఞాతంలో ఉంటూనే ఉద్యమాన్ని నడిపించారు. అనంతరం పార్టీ అత్యున్నత విభాగమైన "పొలిట్ బ్యూరో" సభ్యుడిగా ఎన్నికయ్యారు.

### సిపిఐ(ఎం) జనరల్ సెక్రటరీగా ప్రస్థానం:

1962లో చైనాతో జరిగిన యుద్ధం మరియు రష్యా–చైనా సిద్ధాంతపరమైన విభేదాల నేపథ్యంలో సిపిఐలో అంతర్గత సంక్షోభం తలెత్తింది. ఎస్.ఎ. డాంగే నేతృత్వంలోని రష్యా అనుకూల రైటిస్టు వర్గాన్ని వ్యతిరేకిస్తూ.. లెఫ్టిస్టు వర్గానికి అగ్రనేతగా ఉన్న సుందరయ్య తన బాధ్యతలకు రాజీనామా చేశారు. అనంతరం అక్టోబర్–నవంబర్ 1964లో జరిగిన 7వ పార్టీ కాంగ్రెస్‌లో సిపిఐ చీలిపోయింది. లెఫ్టిస్టులంతా కలిసి భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)–ఙూ×(వీ)గా ఆవిర్భవించగా, ఆ నూతన పార్టీకి సుందరయ్యే 'తొలి సాధారణ కార్యదర్శి' (+వఅవతీషుశ్రీ నావఎతీమ్ముతీఎ)గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1966 వరకు నిర్బంధంలో ఉన్న ఆయన.. 1975 ఎమర్జెన్సీ కాలంలోనూ అజ్ఞాతంలోకి వెళ్లి పోరాడారు. 1976 వరకు సీపీఎం జనరల్ సెక్రటరీగా కొనసాగిన ఆయన, పార్టీలో తలెత్తిన కొన్ని రివిజనిస్టు భావాలను నిరసిస్తూ పొలిట్ బ్యూరో సభ్యత్వానికి, ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసి తన విలువల నిబద్ధతను చాటుకున్నారు.

### నిరాడంబరతకు, ఆదర్శాలకే బ్రాండ్ అంబాసిడర్:

రాజకీయాల్లో సుందరయ్య సృష్టించిన ఆదర్శాలు అజరామరం. 1952లో మద్రాసు నియోజకవర్గం నుండి పార్లమెంటు రాజ్యసభకు ఎన్నికై, సభలో కమ్యూనిస్టు పక్ష నేతగా వ్యవహరించారు. ఆ తర్వాత సుదీర్ఘ కాలం రాష్ట్ర శాసనసభ సభ్యుడిగా (1978–1983 వరకు కూడా) సేవలందించారు. ఢిల్లీలో పార్లమెంటు భవనానికి అయినా.. హైదరాబాద్‌లో అసెంబ్లీకి అయినా ఆయన ఒక సాధారణ సైకిల్‌పై ప్రయాణించి వెళ్లేవారంటే ఆయన నిరాడంబరత ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. లీలా అనే సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగినిని 1943 ఫిబ్రవరి 27న వివాహం చేసుకున్న సుందరయ్య.. ప్రజా సేవకు గృహస్థ జీవితం, పిల్లల పెంపకం అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో 1944 చివరలోనే భార్యాభర్తలిద్దరూ చర్చించుకుని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నారు. ఇలాంటి త్యాగం ప్రపంచ రాజకీయ చరిత్రలోనే అరుదు. కుల వ్యవస్థను వేళ్లతో సహా పెకిలించాలనే ఉద్దేశంతో పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి అనే తన పేరులోని 'రెడ్డి' అనే తోకను కత్తిరించుకొని 'పుచ్చలపల్లి సుందరయ్య'గా మారారు. తానే స్వయంగా రాసిన "తెలంగాణా ప్రజల పోరాటం – దాని పాఠాలు" (1972) అనే గ్రంథం నేటికీ విప్లవ పరిశోధకులకు ఒక బైబిల్ లాంటిది.

పేదరికం, దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని శ్వాస ఉన్నంతవరకు ధారపోసిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 1985, మే 19న కన్నుమూశారు. పదవులు, ఆస్తులు, కుటుంబం.. ఇలా సమస్తాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన ఆ నిరుపమాన దేశభక్తుడు, నిగర్వి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆ విప్లవ తేజానికి ఘన నివాళులు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# బంగారం తగ్గే.. వెండి మండే

**హైదరాబాద్, మే 18:** దేశంలో బంగారం ధరలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. గత వారం చివరి రెండు రోజులుగా భారీగా తగ్గిన పసిడి ధరలు.. ఈ వారం ప్రారంభంలో కూడా అదే ధోరణిని కొనసాగిస్తున్నాయి. అయితే వెండి ధరలు మాత్రం ఒక్కసారిగా భారీగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం.. నేడు ఉదయం 10:30 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,220కు చేరుకుంది. క్రితం ముగింపు ధరతో పోలిస్తే రూ.710 మేర తగ్గింది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.650 తగ్గి రూ.1,43,200 వద్ద కొనసాగుతోంది. విజయవాడలో కూడా ఇదే ధరలు నమోదయ్యాయి. ఇక వెండి ధర మాత్రం భారీగా పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ఏకంగా రూ.10 వేల మేర ఎగబాకి రూ.3 లక్షల మార్క్‌ను తాకింది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరల్లో మార్పులు కనిపించాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910గా కొనసాగుతుండగా.. ముంబైలో రూ.1,56,220, దేశ రాజధాని న్యూఢిల్లీలో రూ.1,56,370గా నమోదైంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,47,500గా ఉండగా.. ముంబైలో రూ.1,43,200, న్యూఢిల్లీలో రూ.1,43,550గా కొనసాగుతోంది. వెండి ధరల విషయానికి వస్తే.. చెన్నైలో కిలో వెండి ధర రూ.3 లక్షలకు చేరుకోగా.. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో రూ.2.90 లక్షల వరకు నమోదవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల మార్పులు, డాలర్ బలపడటం, గ్లోబల్ ఆర్థిక అనిశ్చితులు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# ఐఫోన్ 18 ప్రోలో భారీ మార్పులు

**కుపర్టినో, మే 18:** యాపిల్ సంస్థ నుంచి రానున్న తదుపరి తరం ఐఫోన్ 18 ప్రో సిరీస్‌కు సంబంధించిన లీకులు టెక్ ప్రపంచంలో భారీ చర్చకు దారితీస్తున్నాయి. డిజైన్, కెమెరా, ప్రాసెసర్, బ్యాటరీ విభాగాల్లో ఈసారి యాపిల్ భారీ మార్పులు చేయబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం వస్తున్న వివరాల ప్రకారం.. ఐఫోన్ 18 ప్రో మోడళ్లలో డిస్‌ప్లేపై ఉండే డైనమిక్ ఐలాండ్ పరిమాణాన్ని దాదాపు 35 శాతం వరకు తగ్గించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఫుల్ స్క్రీన్ అనుభవం మరింత మెరుగుపడనుంది. అలాగే ఫోన్ వెనుక గ్లాస్ బ్యాక్, మెటల్ ఫ్రేమ్ మధ్య ఎలాంటి గ్యాప్ కనిపించకుండా సీమ్‌లెస్ డిజైన్‌ను తీసుకురానున్నారు. ఈ సిరీస్‌లో డార్క్ చెర్రీ, స్కై బ్లూ, సిల్వర్, డార్క్ గ్రే వంటి కొత్త రంగులను కూడా ప్రవేశపెట్టే అవకాశముందని టెక్ వర్గాలు చెబుతున్నాయి. కెమెరా విభాగంలో మాత్రం యాపిల్ భారీ అప్‌గ్రేడ్ చేయనుంది. మొదటిసారిగా వేరియబుల్ అపెర్చర్ టెక్నాలజీని ప్రధాన కెమెరాలో అందించనున్నట్లు సమాచారం. దీని ద్వారా డీఎస్‌ఎల్‌ఆర్ కెమెరాల మాదిరిగా కాంతి ప్రవాహాన్ని నియంత్రించుకుని తక్కువ వెలుతురులో కూడా అద్భుతమైన ఫోటోలు తీసుకునే అవకాశం ఉంటుంది. అలాగే కొత్త స్టాక్డ్ ఇమేజ్ సెన్సార్, పెద్ద అపెర్చర్ లెన్స్‌లు, సుదూర ఫోటోగ్రఫీ కోసం ప్రత్యేక జూమ్ టెక్నాలజీ కూడా ఈ ఫోన్లలో ఉండే అవకాశముంది. డిస్‌ప్లే పరంగా కొత్త ఎల్‌టీపీఓ ప్లస్ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. ఇది స్క్రీన్ క్వాలిటీని మెరుగుపరచడమే కాకుండా బ్యాటరీ వినియోగాన్ని కూడా తగ్గించనుంది. ఈ ఫోన్లలో యాపిల్ అత్యంత శక్తివంతమైన ఏ20 ప్రో చిప్‌ను అమర్చనుంది. ప్రపంచంలోనే తొలిసారిగా 2 నానోమీటర్ టెక్నాలజీతో తయారవుతున్న ఈ చిప్ వల్ల పనితీరు భారీగా పెరగనుండగా.. బ్యాటరీ సామర్థ్యం కూడా గణనీయంగా మెరుగుపడనుంది. ముఖ్యంగా ఐఫోన్ 18 ప్రో మాక్స్ మోడల్‌లో 5,000ఎంఏహెచ్ కంటే ఎక్కువ సామర్థ్యం గల భారీ బ్యాటరీని అందించే అవకాశముందని లీకులు సూచిస్తున్నాయి. ఇది ఇప్పటివరకు వచ్చిన ఐఫోన్‌లలోనే అతిపెద్ద బ్యాటరీ అవుతుంది. ఇక కనెక్టివిటీ విషయంలో కూడా యాపిల్ కొత్త టెక్నాలజీని జోడిస్తోంది. సెల్ సిగ్నల్ లేని ప్రాంతాల్లో కూడా శాటిలైట్ కమ్యూనికేషన్ ద్వారా అత్యవసర సందేశాలు పంపుకునే సదుపాయాన్ని మరింత విస్తరించనుంది. అయితే యాపిల్ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాకపోయినా.. ప్రస్తుతం వస్తున్న లీకులు టెక్ ప్రియుల్లో భారీ అంచనాలను పెంచుతున్నాయి.





# రూపాయే

**న్యూఢిల్లీ, మే 18:** భారత రూపాయి విలువ సోమవారం చరిత్రలోనే కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.2 శాతం క్షీణించి రూ.96.20 వద్దకు చేరుకుంది. దీంతో రూపాయి ఆల్‌టైమ్‌లో స్థాయిని నమోదు చేసింది. పశ్చిమా సియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగిన అనిశ్చితి కారణంగా రూపాయిపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. ఇప్పటికే గత శుక్రవారం తొలిసారిగా డాలర్‌తో పోలిస్తే రూపాయి రూ.96 మార్క్‌ను దాటగా.. సోమవారం మరింత బలహీనపడింది. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం రూపాయి పతనానికి ప్రధాన కారణంగా మారింది. యూ ఏఈలోని అణు విద్యుత్ కేంద్రంపై దాడి జరిగిందన్న వార్తలతో బ్రెం ట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 111 డాలర్లకు చేరుకుంది. అలాగే ఇరాన్ పై

## చరిత్రలోనే కనిష్ఠానికి రూపాయి మార్కెట్లలో ఆందోళన

అమెరికా సైనిక చర్యలకు దిగే అవకాశాలు ఉన్నాయన్న సంకేతాలు ప్రపంచ మార్కెట్లలో భయాందోళనలు పెంచుతున్నాయి. ఈ పరిణామాలతో ప్రపంచవ్యాప్తంగా డాలర్‌కు డిమాండ్ పెరగడంతో.. అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అందులో భాగంగా భారత రూపాయి కూడా భారీ పతనాన్ని చవిచూ సింది. రూపాయి బలహీనత ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపైనా కనిపించింది. సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 808 పాయింట్లు, నిఫ్టీ 247 పాయింట్లు నష్టపోయాయి. పెట్టుబడిదారుల్లో ఆందోళన వాతావరణం నెలకొంది. ఇక రూపాయి పతనాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంక్ చర్యలు చేప ట్టాయి. వెండి దిగుమతులపై కొన్ని ఆంక్షలు విధించడంతో పాటు.. కరెన్సీ మార్కెట్‌లో ఆర్బీఐ జోక్యం చేసుకుంటున్నట్లు సమాచారం. అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వారమంతా రూపాయిపై ఒత్తిడి కొనసాగే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అమెరికా-చైనా వ్యవసాయ ఒప్పందం

## ట్రంప్ వ్యూహానికి ఫలితం?

**వాషింగ్టన్, మే 18:** అంతర్జాతీయ వాణిజ్య రంగంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఇటీవల జరిగిన కీలక చర్చల అనంతరం వైట్ హౌస్ ఒక ముఖ్య ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం.. చైనా వచ్చే మూడు సంవత్సరాల్లో అమెరికా నుంచి భారీ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి అంగీకరించింది. ప్రతి ఏడాది కనీసం 17 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటామని చైనా హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.1.4 లక్షల కోట్లకు సమానం. 2026, 2027, 2028 సంవత్సరాల్లో ఈ కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగనున్నట్లు వైట్ హౌస్ స్పష్టం చేసింది. గత ఏడాది అక్టోబర్‌లో సోయాబీన్ కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందాలు దీనికి అదనమని తెలిపింది. గత కొంతకాలంగా అమెరికా-చైనా మధ్య



కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం కారణంగా అమెరికా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒకరిపై ఒకరు భారీ టారిఫ్‌లు విధించుకోవడంతో అమెరికా నుంచి చైనాకు జరిగే వ్యవసాయ ఎగుమతులు గణనీయంగా తగ్గిపోయాయి. 2025 నాటికి అమెరికా వ్యవసాయ ఎగుమతులు 65.7 శాతం పడిపోయి కేవలం 8.4 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ముఖ్యంగా సోయాబీన్ ఎగుమతుల్లో భారీ ప్రభావం కనిపించింది. 2016లో చైనా తన సోయాబీన్ అవసరాల్లో 41 శాతం అమెరికాపై ఆధారపడగా.. 2024 నాటికి అది 20 శాతానికి పడిపోయింది. అయితే ఇప్పుడు ట్రంప్ ఒత్తిడి నేపథ్యంలో చైనా మళ్లీ అమెరికా వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అమెరికా బీఫ్ కంపెనీలపై ఉన్న సస్పెన్షన్లను ఎత్తివేయడానికి చైనా అంగీకరించింది. అలాగే బర్డ్ ఫ్లూ ప్రభావం లేని అమెరికా రాష్ట్రాల నుంచి చికెన్ దిగుమతులను తిరిగి ప్రారంభించేందుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ తాజా ఒప్పందం వల్ల అమెరికా వ్యవసాయ రంగానికి పెద్ద ఊరటనిచ్చే అవకాశముందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, ప్రపంచ వాణిజ్య మార్కెట్లలో కూడా ఈ పరిణామం కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఖర్చుల కోతకు కేంద్రం కీలక ఆదేశాలు

## ప్రభుత్వ బ్యాంకులకు పొదుపు సూచనలు

**న్యూఢిల్లీ, మే 18:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ప్రభావాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ బీమా సంస్థలు, ఆర్థిక సంస్థలు ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై పరిమితులు విధించడంతో పాటు.. దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి మారాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్‌ఐసీ వంటి ప్రభుత్వ రంగ దిగ్గజ సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ సంస్థలకు కూడా వర్తించనున్నాయి. కేంద్ర ఆర్థిక సేవల విభాగం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం.. అత్యవసర పరిస్థితులు తప్ప అన్ని సమావేశాలు, సమీక్షలు, చర్చలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలని సూచించింది. అలాగే చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, సీఈఓల విదేశీ ప్రయాణాలపై కూడా పరిమితులు విధించింది. వీలైనంత వరకు అంతర్జాతీయ సమావేశాలకు వర్చువల్ విధానంలోనే హాజరుకావాలని పేర్కొంది. ఇక ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ కార్యాలయాల్లో ప్రస్తుతం అద్దెకు వినియోగిస్తున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో క్రమంగా ఎలక్ట్రిక్ కార్లను వినియోగంలోకి తీసుకురావాలని కేంద్రం స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే పొదుపు చర్యలు పాటించాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉ




ద్రిక్తతల ప్రభావంతో చమురు ధరలు పెరగడం, రూపాయి విలువ బలహీనపడటం, ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరగడం వంటి పరిస్థితులు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఖర్చులను తగ్గించుకునే దిశగా ఉద్యోగులకు వారంలో రెండు రోజుల పాటు 'వర్క్ ఫ్రమ్ హోమ్' సదుపాయాన్ని కల్పిస్తున్నాయి.




## ఐపీఎల్ ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరం

**హైదరాబాద్, మే 18:** ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ ముగింపుకు చేరుకుంటున్న వేళ ప్లే ఆఫ్స్ సమీకరణాలు అత్యంత ఉత్కంఠభరితంగా మారాయి. ఇప్పటివరకు మొత్తం 62 లీగ్ మ్యాచ్‌లు పూర్తికాగా, పాయింట్ల పట్టికలో 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే అధికారికంగా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఆర్సీబీ తన తదుపరి మ్యాచ్‌లో కూడా విజయం సాధిస్తే టాప్-2లో నిలిచి క్వాలిఫైయర్-1 ఆడే అవకాశాలు మరింత బలపడనున్నాయి. మరోవైపు ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు పేలవ ప్రదర్శనతో ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఇక మిగిలిన మూడు ప్లే ఆఫ్స్ స్థానాల కోసం ప్రస్తుతం ఏడు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్ చేరడం దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. గణాంకాల ప్రకారం ఆ జట్టుకు 99.20 శాతం అవకాశాలు ఉన్నాయి. మరో మ్యాచ్ గెలిస్తే గుజరాత్ క్వాలిఫైయర్-1కు అర్హత సాధించే అవకాశం ఉంది. ఇక 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రస్తుతం 75 శాతం అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. సన్‌రైజర్స్ తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో చెన్నైలో జరగబోయే సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ విజయం సాధిస్తే ప్లే ఆఫ్స్ దారి మరింత సులువవుతుంది. ఒకవేళ ఓడిపోతే చివరి మ్యాచ్‌లో ఆర్సీబీపై భారీ తేడాతో గెలవాల్సిన పరిస్థితి రావచ్చు. అప్పుడు రన్‌రేట్ సమీకరణాలు కూడా కీలకంగా మారనున్నాయి. లీగ్ దశ చివరి మ్యాచ్‌లు దగ్గరపడుతున్న కొద్దీ ప్లే ఆఫ్స్ రేసు మరింత ఆసక్తికరంగా మారుతుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది.

## 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సంచలనం

### ఐపీఎల్‌లో కొత్త చరిత్ర



**న్యూఢిల్లీ, మే 18 :** ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వేదికపై సీనియర్ బౌలర్లను ఉతికి ఆరేస్తూ అరుదైన రికార్డులు సృష్టిస్తున్నాడు. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 21 బంతుల్లోనే 46 పరుగులు చేసి మరోసారి మెరుపులు మెరిపించాడు. ఈ ఇన్నింగ్స్‌తో ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన భారతీయ బ్యాటర్‌గా కొత్త రికార్డు నెలకొల్పాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు వైభవ్ ఏకంగా 43 సిక్సర్లు బాదాడు. ఇంతకుముందు 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అభిషేక్ శర్మ 42 సిక్సర్లతో ఈ రికార్డు సృష్టించగా.. ఇప్పుడు వైభవ్ ఆ ఘనతను అధిగమించాడు. వైభవ్ కొట్టిన 43 సిక్సర్లలో 35 సిక్సర్లు పవర్‌ప్లేలోనే రావడం అతని దూకుడు బ్యాటింగ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. మొదటి ఆరు ఓవర్లలోనే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ రాజస్థాన్‌కు అదిరిపోయే ఆరంభాలు అందిస్తున్నాడు. ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో లుంగీ ఎంగిడి వేసిన తొలి బంతికే భారీ సిక్సర్ బాదిన వైభవ్ మరో అరుదైన ఘనతను కూడా అందుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో మూడుసార్లు తొలి బంతికే సిక్సర్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో చోటు సంపాదించాడు. ఇంతకుముందు షారుఖ్ ఖాన్, సునీల్ నరైన్, దేవదత్ పడిక్కల్ ఈ ఘనత సాధించగా.. ఇప్పుడు వైభవ్ కూడా వారి సరసన నిలిచాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ 486 పరుగులు సాధించాడు. ముఖ్యంగా 234.78 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థి బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. కేవలం 14 పరుగుల తేడాతో 500 పరుగుల మైలురాయిని చేజార్చుకున్నప్పటికీ.. అతని విధ్వంసకర ఆటతీరు చూసి భవిష్యత్తులో భారత జట్టుకు గొప్ప స్టార్ దొరికాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్లేఆఫ్స్‌కు సన్‌రైజర్స్!

### చెన్నయ్ సూపర్ కింగ్స్‌పై 5వికెట్ల తేడాతో అద్భుత విజయం

**పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరిన హైదరాబాద్ జట్టు**



ఐపీఎల్ టోర్నీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. సోమవారం చెన్నయ్‌లోని ఎమ్ఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో చెన్నయ్ సూపర్ కింగ్స్‌పై 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్‌లో తమ స్థానాన్ని మరింత పదిలపర్చుకోగా.. ఓటమి పాలైన చెన్నయ్ సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది.

**చెన్నయ్ :** ఎమ్ ఏ చిదంబరం స్టేడియం వేదికగా సోమవారం 2026 మే 18 న జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచిన చెన్నయ్ సూపర్ కింగ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో హైదరాబాద్ బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఆ జట్టు 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసి ఘన విజయం సొంతం చేసుకుంది. మరో 6 బంతులు మిగిలి ఉండగానే సన్ రైజర్స్ సునాయాసంగా గెలుపొందింది.



**రాణించిన బ్రెవిస్, విజృంభించిన కమిన్స్..**

తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నయ్ బ్యాటర్లలో డెవాల్డ్ బ్రెవిస్ 27 బంతుల్లో 44 పరుగులు, కార్తీక్ శర్మ 19 బంతుల్లో 32 పరుగులు, సంజు శాంసన్ 13 బంతుల్లో 27 పరుగులతో రాణించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. హైదరాబాద్ బౌలర్లలో కెప్టెన్ పాట్ కమిన్స్ 4 ఓవర్లలో 28 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డివిరిచాడు. సాకిబ్ హుస్సేన్ 4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 2 వికెట్లు, ఇషాన్ మలింగ 4 ఓవర్లలో 26 పరుగులిచ్చి ఒక వికెట్ తమ ఖాతాలో వేసుకుని చెన్నయ్ స్కోరును కట్టడి చేశారు.

**కదంతొక్కిన ఇషాన్, క్లాసెన్..**

181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ కు బ్యాటర్లు అద్భుతమైన శుభారంభం అందించారు. ఓపెనర్ ఇషాన్ కిషన్ 47 బంతుల్లో 70 పరుగులు చేసి విజయానికి బాటలు వేయగా, హెన్రిచ్ క్లాసెన్ 26 బంతుల్లో 47 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అభిషేక్ శర్మ సైతం 21 బంతుల్లో 26 పరుగులు చేసి సత్తా చాటాడు. దీంతో సన్ రైజర్స్ సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకుంది. చెన్నయ్ బౌలర్లలో ముకేష్ చౌదరి 4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. అకేల్ హొస్సేన్ 3 ఓవర్లలో 21 పరుగులిచ్చి ఒక వికెట్, నూర్ అహ్మద్ 4 ఓవర్లలో 40 పరుగులిచ్చి ఒక వికెట్ దక్కించుకున్నారు.

**పదిలంగా హైదరాబాద్ స్థానం..**

ఈ అద్భుత విజయంతో సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ రేసులో తన స్థానాన్ని మరింత పదిలపర్చుకుంది. పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడిన హైదరాబాద్ 8 విజయాలు, 5 ఓటములతో 16 పాయింట్లు సాధించి మూడో స్థానానికి చేరుకుంది. మరోవైపు సొంత గడ్డపై కీలక మ్యాచ్ లో ఓడిన చెన్నయ్ సూపర్ కింగ్స్ పరిస్థితి కష్టంగా మారింది. ఇప్పటివరకు 13 మ్యాచ్ లు ఆడిన ఆ జట్టు 6 విజయాలు, 7 ఓటములతో 12 పాయింట్లు మాత్రమే సాధించి ఆరో స్థానంలో నిలిచింది. దీంతో చెన్నయ్ ప్లే ఆఫ్స్ అవకాశాలు బాగా సంక్లిష్టంగా మారాయి. తదుపరి మ్యాచ్ లో తప్పక భారీ తేడాతో గెలవాల్సిన పరిస్థితిలో చెన్నయ్ పడిపోయింది.



## ధోని ఆడతాడా? గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు

**చెన్నై, మే 18:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కీలక దశకు చేరుకోవడంతో ప్లే ఆఫ్స్ సమీకరణాలు మరింత ఉత్కంఠగా మారాయి. 12 మ్యాచ్‌ల్లో ఆరు విజయాలు సాధించిన చెన్నై సూపర్ కింగ్స్ ఇంకా నాకౌట్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తేనే సీఎస్కే ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చెపాక్ స్టేడియం వేదికగా సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఇదే ఈ సీజన్‌లో చెన్నైకి చివరి హోం మ్యాచ్ కావడంతో, మహేంద్ర సింగ్ ధోని బరిలోకి దిగుతాడనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. కొందరు ఇదే మ్యాచ్‌లో ధోని రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందంటూ ఊహాగానాలు చేస్తున్నారు. ఈ ప్రచారంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కండరాల గాయం కారణంగా ధోని ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదని గుర్తుచేశాడు. దాదాపు ఏడాది కాలంగా పోటీ క్రికెట్‌కు దూరంగా ఉన్న ధోని నేరుగా ఇలాంటి కీలక మ్యాచ్‌లో ఆడటం అంత సులభం కాదని అభిప్రాయపడ్డాడు. సీఎస్కేకు ఇది తప్పక గెలవాల్సిన మ్యాచ్ కావడంతో,





పూర్తి ఫిట్‌నెస్ లేని ఆటగాడిని జట్టులోకి తీసుకోవడం ప్రమాదకర నిర్ణయం అవుతుందని పేర్కొన్నాడు. ధోని ప్రస్తుతం తీవ్రంగా సాధన చేస్తున్నప్పటికీ, మ్యాచ్ పరిస్థితుల్లో ఆడకపోవడం ఒక పెద్ద సమస్యగా మారుతుందని గావస్కర్ తెలిపాడు. అభిమానిగా తాను కూడా ధోని మైదానంలోకి దిగాలని కోరుకుంటానని, అతడిని ఆడుతుంటే చూడాలని ప్రతి ఒక్కరికీ ఉంటుందని చెప్పాడు. అయితే వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే, సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో ధోని ఆడకపోవడమే మంచిదని భావిస్తున్నట్లు వెల్లడించాడు. అదే సమయంలో సోషల్ మీడియాలో వినిపిస్తున్న వార్తలు నిజమై ధోని మైదానంలోకి దిగితే మాత్రం అది అభిమానులకు పెద్ద సర్‌ప్రైజ్ అవుతుందని వ్యాఖ్యానించాడు.

## బీసీసీఐకి ఆర్టీఐ వర్తించదు

### కేంద్ర సమాచార కమిషన్ కీలక తీర్పు

**న్యూఢిల్లీ, మే 18 :** భారత క్రికెట్ నియంత్రణ మండలి అయిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా పై సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) వర్తించదని కేంద్ర సమాచార కమిషన్ కీలక తీర్పు వెలువరించింది. బీసీసీఐ ప్రభుత్వ నిధులు పొందే సంస్థ కాదని, ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణలో కూడా పనిచేయడం లేదని స్పష్టం చేస్తూ కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆర్టీఐ చట్టం కింద బీసీసీఐ సమాచారాన్ని బహిర్గతం చేయాల్సిన బాధ్యత ఉండదని తేల్చిచెప్పింది. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే హక్కు బీసీసీఐకి ఎలా వచ్చిందన్న అంశంతో పాటు, జాతీయ-అంతర్జాతీయ క్రికెట్ టోర్నీలకు ఆటగాళ్ల ఎంపిక ఎలా జరుగుతుందనే వివరాలు కోరుతూ దాఖలైన అప్పీల్‌ను కమిషన్ తిరస్కరించింది. బీసీసీఐ తమిళనాడు సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఒక ప్రైవేట్ సంస్థ మాత్రమేనని, అది పార్లమెంట్ చట్టం లేదా ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఏర్పడలేదని కమిషన్ పేర్కొంది. అయితే ఇదే అంశంపై 2018లో కేంద్ర సమాచార కమిషన్ భిన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. భారత జట్టు ఆటగాళ్లు దేశం పేరుతో జెర్సీలు ధరించడం, వివిధ రూపాల్లో ప్రభుత్వ సహకారం లభించడం వంటి కారణాలతో బీసీసీఐని ప్రజా సంస్థగా పరిగణిస్తూ అప్పట్లో ఆర్టీఐ వర్తిస్తుందని తీర్పు ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ బీసీసీఐ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అనంతరం




సుప్రీంకోర్టు సూచనల మేరకు కేసును తిరిగి పరిశీలించిన కమిషన్ తాజా తీర్పును వెలువరించింది. కమిషన్ తన ఉత్తర్వుల్లో మూడు ప్రధాన కారణాలను ప్రస్తావించింది. ప్రభుత్వానికి బీసీసీఐ కార్యకలాపాలపై ప్రత్యక్ష నియంత్రణ లేదని, మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ విక్రయాల ద్వారానే బీసీసీఐ భారీ ఆదాయం సంపాదిస్తోందని తెలిపింది. అలాగే పన్ను రాయితీలు లేదా చట్టపరమైన సౌకర్యాలను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేమని స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు పారదర్శకత అవసరమని వ్యాఖ్యానించినప్పటికీ, బీసీసీఐని ప్రజా సంస్థగా ప్రకటించలేదని కమిషన్ గుర్తు చేసింది. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ధనిక బోర్డుగా ఎదిగిన బీసీసీఐ, ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ విజయంతో ఆర్థికంగా మరింత బలపడింది. అయితే ప్రస్తుత చట్టాల ప్రకారం బీసీసీఐని ఆర్టీఐ పరిధిలోకి తీసుకురావడం సాధ్యం కాదని, అందుకోసం ప్రత్యేక చట్ట సవరణ లేదా ప్రభుత్వ నిర్ణయం అవసరమని కమిషన్ స్పష్టం చేసింది.



# డేటింగ్‌లో శ్రీలీల, తిలక్‌వర్మ

## రూమర్స్‌ను ఖండించిన తల్లి స్వర్ణలత



నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉ ందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు. కార్తిక్ ఆర్యన్ తల్లి, నేనూ ఇద్దరం గైనకాలజిస్టులం. మా వైద్య నేపథ్యం కారణంగా వృత్తిపరంగా కలుసుకుంటాము. దురదృష్టవశాత్తూ.. అందరూ శ్రీలీల, కార్తిక్‌లకు రిలేషన్ ఉందని రాయడం మొదలుపెట్టారని ఖండించారు.



# 'టాక్సిక్' ఆలస్యంపై క్లారిటీ

**బెంగళూరు, మే 18:** కన్నడ సూపర్ స్టార్ యశ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం టాక్సిక్ విడుదల ఆలస్యంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో అనేక రకాల ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో.. హీరో యశ్ తాజాగా అధికారికంగా స్పందించారు. టాలెంటెడ్ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను కేవలం భారతీయ సినిమాగా కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో రూపొందిస్తున్నామని యశ్ వెల్లడించారు. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని భావించినప్పటికీ.. ప్రాజెక్ట్ స్థాయిని మరింత పెంచాలని నిర్ణయించడంతో కొన్ని మార్పులు చేయాల్సి వచ్చిందని చెప్పారు. అదే కారణంగా సినిమా విడుదల తేదీని వాయిదా వేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. “భారత్‌లో సినిమా ప్రకటించగానే మార్కెటింగ్, బిజినెస్ ప్రక్రియలు మొదలవుతాయి. కానీ హాలీవుడ్‌లో మాత్రం సినిమా పూర్తయ్యాకే అసలు వ్యాపారం ప్రారంభమవుతుంది. పూర్తి అవుట్‌పుట్ చూసిన తర్వాతే అక్కడ పెట్టుబడిదారులు, డిస్ట్రిబ్యూటర్లు నిర్ణయాలు తీసుకుంటారు” అని యశ్ వివరించారు. ప్రస్తుతం 'టాక్సిక్' సినిమాను కూడా అదే తరహాలో అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ప్లాన్ చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి కంటెంట్‌ను అందించేందుకు ప్రీ-ప్రొడక్షన్ నుంచి మేకింగ్ వరకు ప్రతి విషయంలోనూ రాజీ పడకుండా పని చేస్తున్నామని చెప్పారు. “కొంచెం సమయం ఎక్కువ పడుతున్నా.. ఫలితం మాత్రం ప్రేక్షకుల అంచనాలకు మించి ఉంటుంది” అని యశ్ ధీమా వ్యక్తం చేశారు. అభిమానులు ఈ ఆలస్యాన్ని అర్థం చేసుకుని సహకరించాలని కూడా కోరారు. ఇప్పటికే కేజీఎఫ్ సిరీస్‌తో పాన్ ఇండియా స్థాయిలో భారీ గుర్తింపు తెచ్చుకున్న యశ్.. ఇప్పుడు 'టాక్సిక్' ద్వారా మరోసారి గ్లోబల్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తున్నట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# అట్లీ-ప్రియకు కూతురు

## మియూగా నామకరణం చేసినట్లు వెల్లడి




తమిళ దర్శకుడు అట్లీ కుటుంబంలో ఇటీవల ఆనందం రెట్టింపైంది. స్టార్ దర్శకుడు అట్లీ, ఆయన భార్య ప్రియ దంపతులకు ఇటీవల పండంటి ఆడబిడ్డ జన్మించింది. ఇప్పుడు తమ చిన్నారి కుమార్తెకు పెట్టిన ప్రత్యేకమైన పేరు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. గత ఏప్రిల్‌లో జన్మించిన తమ కుమార్తెకు అట్లీ దంపతులు 'మియూ' అనే ప్రత్యేకమైన పేరును ఖరారు చేశారు. పాప పుట్టిన దాదాపు నెల రోజుల తర్వాత, ఆదివారం సోషల్ మీడియా ద్వారా ఈ పేరును అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిన్నారి చేతిని ప్రేమగా పట్టుకున్న ఓ మధురమైన ఫోటోను అభిమానులతో పంచుకున్నారు. ఆ పోస్ట్‌లో వారు, మా హృదయాలకు ఒక కొత్త ఇల్లు దొరికింది. ఆమె పేరు మియూ. మా గుండెల్లో అత్యంత పెద్ద స్థానాన్ని సంపాదించుకున్న చిన్నారి దేవత అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. ఈ పేరును ప్రత్యేకంగా నిలబెట్టింది దాని అర్థమే. సాధారణంగా భారతీయ లేదా సంస్కృత మూలాల పేర్లు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అయితే అట్లీ దంపతులు జపనీస్ సంస్కృతి నుంచి ఈ పేరును ఎంపిక చేసుకున్నారు. జపనీస్ భాషలో 'మియూ' అంటే అందం, ప్రేమ, పవిత్రమైన సౌమ్యత కలిగిన వ్యక్తి అనే అర్థం వస్తుంది. ఈ విభిన్నమైన పేరు నెటిజన్లను ఆకట్టుకుంటోంది. సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియాలో అట్లీ దంపతులకు అభినందనలు తెలియజేస్తున్నారు. కాగా, అట్లీ-ప్రియ దంపతులకు ఇప్పటికే ఒక కుమారుడు కూడా ఉన్నాడు. వారి పెద్ద కుమారుడు 'మీర్' జనవరి 2023లో జన్మించాడు. జవాన్ చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఆయన క్రేజ్ పాన్-ఇండియా స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై అట్లీ దృష్టి సారించారు.

# రష్మిక టాటూ వెనుక అసలు కథ ఇదే..

# విజయ్ కోసమేమీ కాదు!


**హైదరాబాద్, మే 18:** టాలీవుడ్ స్టార్ హీరోయిన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న వ్యక్తిగత విషయాలపై సోషల్ మీడియాలో తరచూ పుకార్లు వైరల్ అవుతూనే ఉంటాయి. ముఖ్యంగా ఆమె కుడి చేతి మణికట్టుపై ఉన్న “ఇర్రీప్లేసబుల్” టాటూ గురించి చాలా కాలంగా చర్చ జరుగుతోంది. ఈ టాటూను హీరో విజయ్ దేవరకొండ కోసమే ప్రత్యేకంగా వేయించుకుందంటూ సోషల్ మీడియాలో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన రష్మిక.. ఈ టాటూ వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడిస్తూ అన్ని పుకార్లకు చెక్ పెట్టారు. తనకు మొదట్లో టాటూలపై పెద్దగా ఆసక్తి లేదని రష్మిక చెప్పారు. కానీ కాలేజీ రోజుల్లో జరిగిన ఓ చిన్న సంఘటన తన ఆలోచనను పూర్తిగా మార్చేసిందని తెలిపారు. ఒకరోజు కాలేజీలో ఓ అబ్బాయి.. “ఆడపిల్లలు నొప్పిని అస్సలు భరించలేరు.. సూదులు, ఇంజెక్షన్లు అంటే చాలా భయపడతారు” అంటూ ఎగతాళి చేసినట్లు రష్మిక గుర్తుచేసుకున్నారు. ఆ మాటలను ఛాలెంజ్‌గా తీసుకున్న తాను.. ఆడవాళ్లు ఎంతటి నొప్పినైనా భరించగలరని నిరూపించాలనే ఉద్దేశంతో టాటూ వేయించుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అయితే టాటూ వేయించుకోవాలని నిర్ణయించిన తర్వాత.. ఏ పదాన్ని రాయించుకోవాలా అని చాలా ఆలోచించానని చెప్పారు. “ఈ ప్రపంచంలో ప్రతి వ్యక్తి ప్రత్యేకమైనవాడు.. ఎవ్వరినీ మరొకరు భర్తీ చేయలేరు” అనే నమ్మకం తనకు చాలా బలంగా ఉందని తెలిపారు. ఆ భావనను ఎప్పటికీ గుర్తుంచుకోవడానికి “ఇర్రీప్లేసబుల్” అనే పదాన్నే టాటూగా ఎంచుకున్నట్లు రష్మిక స్పష్టం చేశారు. దీంతో ఈ టాటూ విజయ్ దేవరకొండ కోసం వేయించుకున్నారన్న ప్రచారానికి పూర్తిగా తెరపడినట్టైంది. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం రష్మిక పలు పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు. పుష్ప సినిమా తర్వాత ఆమెకు దేశవ్యాప్తంగా మరింత క్రేజ్ పెరిగిన విషయం తెలిసిందే.




# కాఫీకప్పులో తుఫాన్

## కురుప్పులో విజయ్ అంటూ..ప్రచారం

సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో ఆర్‌జే బాలాజీ తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' తెలుగులో వీరభద్రుడుగా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వైరల్ అవుతోంది. ఇందులో విజయ్ నటించారంటూ ఓ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ 'లియో' చిత్రానికి సంబంధించిన రిఫరెన్స్ ఉన్నట్లు నెటిజన్లు గుర్తిస్తున్నారు. 'కరుప్పు'లో వచ్చే ఒక సన్నివేశంలో ఎవరో కాఫీ పెడుతున్నట్లు చూపిస్తారు. అయితే ఆ కాఫీ పెడుతున్న వ్యక్తి మరెవరో కాదు.. 'లియో' సినిమాలోని పార్థిబన్ (విజయ్) క్యారెక్టరేనని ఊహించుకుంటున్నారు. పైగా ఈ సన్నివేశానికి ముందు కాఫీ షాప్‌లో సర్వర్.. 'నీకు స్పెషల్ లియో కాఫీ తెస్తాను' అనడం.. అక్కడ కాఫీ పెడుతోన్న వ్యక్తిని వెనక నుంచి మాత్రమే చూపించడంతో అందరూ విజయ్ అతిథి పాత్రలో నటించారా! అని మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. కాఫీ షాప్ సన్నివేశంలో కనిపించిన శాండీ, జననీ ఇద్దరూ విజయ్ 'లియో'లోనూ కాఫీషాప్ సీన్‌లో నటించారు. ఈ సన్నివేశంపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ పెడుతున్నారు. 'ఈ సీన్ వచ్చినప్పుడు థియేటర్ అరుపులతో దద్దరిల్లింది' అని ఒకరు అనగా.. కరుప్పు' సినిమాలో ఆ కాఫీ కప్పు, ఆ మేకింగ్ స్టైల్ చూస్తుంటే కచ్చితంగా అది 'లియో' సినిమాలోని పార్థిబన్ కేఫ్ రిఫరెన్సే. ఆర్జే బాలాజీ నిజంగానే గట్టి ప్లాన్ చేశారు అని మరో నెటిజన్ కామెంట్ పెట్టారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com